# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి, సంపుటి : 01, సంచిక : 296, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం - 08- జనవరి - 2025


## మరో ఇద్దరు చిన్నారులకు పాజిటివ్..
## భారత్‌లో క్రమంగా పెరుగుతున్న హెచ్‌ఎమ్‌పీవీ కేసులు



హెచ్ఎంపీవీ ప్రపంచమంతా ఉన్నదే

అప్రమత్తమైన రాష్ట్రాలు

ఇదేమీ కొత్త వైరస్ కాదు

**న్యూఢిల్లీ,:** చైనాలో వేగంగా వ్యాపిస్తున్న హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కేసులు భారత్‌లోనూ క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే కర్ణాటక రాజధాని బెంగళూరులో రెండు, అహ్మదాబాద్‌లో ఒకటి, చెన్నైలో మరో రెండు కేసులు వెలుగు చేసిన విషయం తెలిసిందే. మిగతా..2లో

## ఇదే నా చివరి ఎన్నికల ప్రెస్ కాన్ఫరెన్స్




కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక ప్రకటన

రాజీవ్ కుమార్ సెప్టెంబర్ 1, 2020న ఎన్నికల కమిషన్‌లో కమిషనర్‌గా నియామకమయ్యారు

**న్యూఢిల్లీ,:** కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఈసీగా ఇదే మిగతా..2లో

## ఛాంపియన్స్ ట్రోఫీకి వైస్ కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్!



స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు!

బీసీసీఐ సెలక్టర్లు యోచిస్తున్నట్టుగా కథనాలు

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అదరగొట్టిన బుమ్రా

రెండు మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గానూ రాణించి ఆకట్టుకున్న స్టార్ పేసర్

**న్యూఢిల్లీ,:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఆరంభానికి సమయం దగ్గరపడుతోంది. పాకిస్థాన్, దుబాయ్ వేదికగా వచ్చే నెలలో ఈ మెగా టోర్నీ జరగనుంది. మిగతా..2లో

## కాంగ్రెస్ వాళ్లు ఒక్కరూ కూడా బయట తిరగలేరు.. ఖబడ్దార్



‘తెలంగాణ బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నాం

హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది పిరికిపిందల చర్య. ఇలాంటి దుర్మార్గమైన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ తన తీరును మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి నేపథ్యంలో కిషన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..‘తెలంగాణ బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నాం. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గూండాలు, రౌడీల్లాగా వ్యవహరిస్తున్నారు. రాళ్లతో, కర్రలతో చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది పిరికిపిందల మిగతా..2లో

# కుప్పంలో సీఎం బిజీబిజీ..

కుప్పంలో జన నాయకుడు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన అధినేత

జన నాయకుడు కేంద్రం ప్రారంభించి, పనితీరుపై పరిశీలన



చిత్తూరు,:జిల్లాలోనికుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా స్వర్ణ కుప్పంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబిగాని పల్లి, తంబి గానిపల్లి గ్రామంలో 41.22 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. మిగతా..2లో

## ఆరోగ్యశ్రీని వదిలించుకునే ప్రయత్నం జరుగుతోంది




ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేశారని షర్మిల విమర్శ

ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు

పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**అమరావతి,:** అరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం అనారోగ్యశ్రీగా మార్చేసిందని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్య శ్రీ అని ఆమె చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గారి మానస పుత్రిక ఈ పథకమని అన్నారు. ప్రాణాలు తీసే జబ్బొచ్చినా సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని... మిగతా..2లో

## కేటీఆర్ ఈ కేసును ఎదుర్కోవాల్సిందే!



- ఫార్ములా ఈ-కార్ కేసును కేటీఆర్ ఎదుర్కోవాల్సిందేనన్న జూపల్లి
- బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అయిందని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగిందన్న జూపల్లి

హైదరాబాద్, : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో తప్పు చేయనప్పుడు కోర్టుకు కేటీఆర్ ఎందుకు వెళ్లారని ఆయన,ప్రశ్నించారు.కేసును కేటీఆర్ ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్ ను

## ‘నా మాటలు రాసిపెట్టుకోండి’...




ఫార్ములా ఈ-కారు రేసు కేసులో వేగంగా మారుతున్న పరిణామాలు

ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేటీఆర్ ఆసక్తికర ట్వీట్

ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటామన్న మాజీ మంత్రి

నేటి అడ్డంకులే రేపటి విజయానికి నాంది అన్న కేటీఆర్

**హైదరాబాద్, :** ఫార్ములా ఈ-కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. హైకోర్టు ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. అలాగే ఈడీ మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న తమ ఎదుట హాజరు కావాలని నోటీసులు ఇచ్చింది. ఇలా ఈ కేసు వ్యవహారంలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి.

## మంత్రి లోకేశ్ సమక్షంలో
## సుజ్లాన్-ఏపీఎస్ఎస్‌డీసీ అవగాహన ఒప్పందం

- రెన్యువబుల్ ఎనర్జీలో నైపుణ్యాభివృద్ధికి సుజ్లాన్‌తో ఏపీ ప్రభుత్వం భాగస్వామ్యం
- యువతకు విండ్ ఎనర్జీలో అంతర్జాతీయస్థాయి అవకాశాలకు దోహదం చేస్తుందన్న మంత్రి లోకేశ్
- సుజ్లాన్ భాగస్వామ్యం ఏపీని విండ్ ఎనర్జీ నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేస్తుందని వ్యాఖ్య
- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉపాధికి తోడ్పడే గ్లోబల్ సర్టిఫికేట్లు అందిస్తామన్న మంత్రి




**అమరావతి,:** ఏపీలో దేశంలోనే అతిపెద్ద విండ్ ఎనర్జీ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాలు ఎంఓయూ చేసుకున్నాయి. వచ్చే 4 సంవత్సరాలలో ఆంధ్ర ప్రదేశ్‌ను విండ్ ఎనర్జీ నైపుణ్యాల కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా సుజ్లాన్ సహకారంతో యాంత్రిక, ఎలక్ట్రికల్, బ్లేడ్ టెక్నాలజీ, సివిల్, లైసనింగ్ వంటి కీలక రంగాల్లో 12వేల మందికి శిక్షణ ఇస్తారు. యువత, మహిళలు, ఎస్‌టీఈఎం గ్రాడ్యుయేట్స్ చురుకైన మిగతా..2లో

## తిరుమలకు వెళ్లే భక్తులకు అలర్ట్..



వైకుంఠ ద్వార దర్శనం టికెట్లను ఇలా ఈజీగా పొందండి!

ఈ నెల 9న ఎస్ఎస్‌డీ టికెట్ల నిలిపివేత

తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లను ఏర్పాటు

**అమరావతి,:** వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ కీలక సూచనలు చేసింది. జనవరి 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు

# త్వరలో లక్ష మంది కూర్చునే స్టేడియం..!

## భారతదేశంలో అతిపెద్ద క్రీడా మైదానం

- 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం
- క్రీడారంగంలో తెలంగాణకు కొత్త ఒరవడి
- ఆస్ట్రేలియా, సింగపూర్ పర్యటనల ప్రాధాన్యత
- దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



హైదరాబాద్: ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. తెలంగాణ రాష్ట్రం క్రీడా రంగంలో కీలకమైన అడుగులు వేయబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, దేశంలోని మిగతా..2లో

## తప్పు చేసినట్టుగా హైకోర్ట్ చెప్పలేదన్న హరీశ్ రావు



ఫార్ములా ఈ-రేస్ కేసు.. కేటీఆర్ ఇంటి వెలుపల హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు

కేసు విచారణ కొనసాగించడానికే అనుమతించిందని వ్యాఖ్య

వంద కేసులు పెట్టినా రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటామన్న మాజీ మంత్రి

**హైదరాబాద్, :** ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నిసార్లు అరెస్టులు చేసినా, వంద కేసులు పెట్టినా రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన అన్నారు.కేసు విచారణ కొనసాగించడానికి హైకోర్ట్ అనుమతించిందని, తప్పు చేసి నట్టుగా ఎక్కడా చెప్పలేదని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. మిగతా..2లో

శుభోదయం
బుధవారం - 08 - జనవరి - 2025

# ఇదే నా చివరి ఎన్నికల ప్రెస్ కాన్ఫరెన్స్

**న్యూఢిల్లీ,:** కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఈసీగా ఇదే నా చివరి ఎన్నికల మీడియా సమావేశమని వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా త్వరలోనే పదవీకాలం ముగియబోతుందని పేర్కొన్నారు. రాజీవ్ కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేయనున్నారు. విలేకరుల సమావేశంలో ఈవీఎంలతో పాటు అదనపు ఓట్ల వరకు ఎన్నికల కమిషన్‌పై వచ్చిన ఆరోపణలపై ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రాజీవ్ కుమార్ 15 మే 2024న రాజీవ్ కుమార్ 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 1 సెప్టెంబర్ 2020 నుంచి ఎన్నికల కమిషన్‌గా ఎన్నికల సంఘంతో అనుబంధం ఉంది. ఆయన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో 2020లో బీహార్ రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరిగాయి. కోవిడ్ సమయంలోనూ ఉత్తరప్రదేశ్ సహా మహారాష్ట్ర, హర్యానా, జార?ండ్‌తో సహా పలు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. అలాగే, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలతో పాటు లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను రాజీవ్ కుమార్ హయాంలోనే జరిగాయి.

### రాజీవ్ కుమార్ ఎవరు..?

రాజీవ్ కుమార్ 1960 ఫిబ్రవరి 19న జన్మించారు. ఆయన 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. దాదాపు 36 సవత్సరాల పాటు వివిధ హోదాల్లో పని చేశారు. కేంద్రంలోని అనేక మంత్రిత్వశాఖలతో పాటు బిహార్, జార?ండ్ కేడర్‌లోనూ చాలాకాలం పాటు సేవలందించారు. సామాజిక, పర్యావరణ-అటవీ, మానవ వనరులు, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాల్లోనూ సేవలందించారు. ఆయన ఫిబ్రవరి 2020లో కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. రాజీవ్ కుమార్ సెప్టెంబర్ 1, 2020న ఎన్నికల కమిషన్‌లో కమిషనర్‌గా నియామకమయ్యారు. నిబంధనల ప్రకారం, ఎన్నికల కమిషనర్ పదవీకాలం ఆరు సంవత్సరాలు లేదంటే.. 65 సంవత్సరాల వయస్సు వరకు ఉంటుంది. రాజీవ్ కుమార్ ఫిబ్రవరి 1960లో జన్మించినందున, ఆయన పదవీకాలం ఏడాది ఫిబ్రవరితో పదవీకాలం ముగియనున్నది.

# ఛాంపియన్స్ ట్రోఫీకి వైస్ కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్!

మొదటి పేజి తరువాయి

భారత జట్టుని బీసీసీఐ సెలక్షన్ కమిటీ మరికొన్ని రోజుల్లోనే ప్రకటించనుంది. జట్టు సారథిగా రోహిత్ శర్మ ఖరారైనట్టు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, వైఎస్ కెప్టెన్‌గా ఎవర్ని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ క్రికెట్ వర్గాల్లో నెలకొంది. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వెన్నునొప్పి గాయం నుంచి కోలుకుంటే వైస్ కెప్టెన్‌గా సెలక్టర్లు ఎంపిక చేస్తారని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేర్కొంది. పరిమితి ఓవర్ల క్రికెట్‌లో వైస్ కెప్టెన్‌గా బుమ్రాను పరిగణనలోకి తీసుకున్న సందర్భాలు చాలా తక్కువ కావడంతో ఈ తాజా కథనం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ హయాంలో వన్డే, టీ20 జట్లకు హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించేవాడు. కొన్నిసార్లు కేఎల్ రాహుల్ కూడా ఆ బాధ్యతలు నిర్వహించాడు. అయితే, కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక వన్డేలు, టీ20లలో వైస్ కెప్టెన్ బాధ్యతలను శుభ్‌మాన్ గిల్‌కు అప్పగిస్తున్నారు. అయితే, ఇటీవల ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అద్భుత వ్యక్తిగత ప్రదర్శనతో పాటు రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించి రాణించిన బుమ్రాకు ఛాంపియన్స్ ట్రోఫీలో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని సెలక్టర్లు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియాలో భారత్ గెలిచిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు అతడే సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా, ఆస్ట్రేలియాతో జరిగిన చివరి టెస్టులో గాయపడ్డ జస్ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులోకి రావడం దాదాపు ఖాయమే. ఆ సమయానికి కోలుకోనున్నాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు అందుబాటులోకి రావడంపై ఇంకా స్పష్టత రాలేదు.

# కాంగ్రెస్ వాళ్లు ఒక్కరూ కూడా బయట తిరగలేరు.. ఖబడ్దార్

మొదటి పేజి తరువాయి

చర్య. ఇలాంటి దుర్మార్గమైన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ తన తీరును మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నాను. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ ఆఫీస్ గేటు వద్ద దాడికి పాల్పడటం దుర్మార్గం. రాళ్లు, కర్రలతో కాంగ్రెస్ గూండాలు పోలీసుల సమక్షంలో, పోలీసులతో కలిసి వచ్చి ఆఫీసుపైన, బీజేపీ కార్యకర్తలపైన దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలకు, భౌతిక దాడులకు తావు లేదు. ఇలాంటి రాజకీయాలకు మేం పూర్తి వ్యతిరేకం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇలాంటి కక్షపూరిత, ద్వేషపూరిత రాజకీయాలు రాష్ట్రంలో పెరిగిపోయాయి. గతంలో సొంతపార్టీకి చెందిన ముఖ్యమంత్రులను గద్దెదించేందుకు మతకల్లోలాలు సృష్టించిన దుర్మార్గమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీ సొంతం. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అసమర్థ పాలనతో ప్రజల్లో ఆదరణ కోల్పోతున్న తరుణంలో.. అసహనంతో ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోంది. ఇలాంటి దాడులను ఆపకపోతే.. ఆ తర్వాత తలెత్తే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నాను. పోలీసుల సమక్షంలో బీజేపీ కార్యాలయంపై దాడిచేసి.. మా కార్యకర్తలను గాయపరిచిన విషయం ముఖ్యమంత్రికి తెలియకుండా జరగదు. ఖబడ్దార్, అసహనం కోల్పోయి మీరు చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు తిరగబడితే.. దేశంలో కాంగ్రెస్‌కు ఉన్న కొద్దిపాటి నాయకులు తిరగలేని పరిస్థితులు ఏర్పడతాయి. రాష్ట్రంలో ఈ రకమైన దాడులతో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మా సహనాన్ని అసమర్థతగా భావించవద్దు. మేం హింసా రాజకీయాలను ప్రోత్సహించం. అలాగని మాపై దాడులు చేస్తే సహించం. ఎవరి వ్యాఖ్యలైనా మీకు నచ్చకపోతే.. నిరసన తెలియజేయండి అంతే కానీ.. కార్యాలయంపై భౌతికంగా దాడి చేయడం, రాళ్లు, కర్రలతో దాడికి దిగడం సరికాదు. తన వ్యాఖ్యలకు ఢిల్లీకి చెందిన మాజీ ఎంపీ రమేశ్ బిదూరీ గారు క్షమాపణలు చెప్పిన తర్వాత కూడా.. అసహనంతో దాడులు చేయడం సరైనదేనా?. గతంలోనూ ప్రధానమంత్రికి పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక గాంధీ-నెహ్రూ కుటుంబసభ్యులు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీన్ని ఖండిస్తూ బీజేపీ ఎక్కడైనా దాడులు చేసిందా?. ఈ వ్యాఖ్యలకు ఒక్కసారి కూడా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒక్కసారైనా క్షమాపణలు చెప్పారా?. అలాంటి సంస్కారం కాంగ్రెస్ పార్టీకి లేదు. మేం దీనికి ప్రతిగా సమాధానం చెబితే.. ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు దేశంలో రోడ్లపై తిరగలేడు. కానీ ఇది మా సంస్కృతి కాదు. మీ సంస్కృతిని మార్చుకోండి అంటూ హెచ్చరించారు.

# కేటీఆర్ ఈ కేసును ఎదుర్కోవాల్సిందే!

మొదటి పేజి తరువాయి

తెలంగాణ హైకోర్టు కొట్టి వేసిందని... కేసు విచారణకు కేటీఆర్ హాజరు కావాలని చెప్పారు. బాన్సువాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే భూస్థాపితం అయిందని జూపల్లి అన్నారు. భవిష్యత్తులో కూడా ఆ పార్టీ కోలుకునే పరిస్థితి లేదని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలగానే మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. రైతు భరోసా కింద రైతులకు రూ. 21 వేల కోట్లను చెల్లించామని జూపల్లి తెలిపారు. కేసీఆర్ చేసిన అప్పులకు తమ ప్రభుత్వం ప్రతి నెల రూ. 6,500 కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగిందని అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ శ్రీరామ రక్ష అని అన్నారు.

# తిరుమలకు వెళ్లే భక్తులకు అలర్ట్..

మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలో క్యూలైన్లలో రద్దీని నియంత్రించేందుకు టోకెన్లు, టికెట్లపై నిర్దేశించిన సమయం ప్రకారం మాత్రమే భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపింది. అలాగే వైకుంఠ ద్వార దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్లను పొందని భక్తులకు నేరుగా తిరుమల, తిరుపతిలో ఎస్ఎస్‌డీ టికెట్లు తీసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లను ఏర్పాటు చేసింది. అలాగే స్థానికుల కోసం తిరుమలలో మరో 4 కౌంటర్లు ఏర్పాటు చేసింది. తిరుపతిలో ఇందిరా మైదానం(15), రామచంద్ర పుష్కరిణి(10), శ్రీనివాసం కాంప్లెక్స్(12), విష్ణునివాసం కాంప్లెక్స్(14), భూదేవి కాంప్లెక్స్(11), భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల(10), ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(8), జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(10), అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్(4)లో ఏర్పాట్లు చేసింది. జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేయనున్నారు.

### ఈ నెల 9న ఎస్ఎస్‌డీ టికెట్ల నిలిపివేత

వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు ఇస్తున్న నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించిన ఎస్ఎస్‌డీ టికెట్లను జారీ చేయడం నిలిపివేసింది. ఆ రోజు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా నేరుగా దర్శనం చేసుకోవచ్చని టీటీడీ సూచించింది. కాగా, వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో పది రోజుల పాటు ఎలాంటి విశేష దర్శనాలకు భక్తులను అనుమతించరు. చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ శాఖ, ఎన్ఆర్ఐ మొదలైన అన్ని దర్శనాలను రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలకు కూడా ఈ రోజుల్లో అనుమతించరు.

# 'నా మాటలు రాసిపెట్టుకోండి'...

మొదటి పేజి తరువాయి

ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేటీఆర్ ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. "నా మాటలు రాసిపెట్టుకోండి. ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటాం. మీ అబద్ధాలు నన్ను అడ్డుకోలేవు. మీ ఆరోపణలు నన్ను తగ్గించలేవు. మీ చర్యలు నా దృష్టిని మరుగుపరచలేవు. మీ కుట్రలు నా నోరు మూయించలేవు. నేటి అడ్డంకులే రేపటి విజయానికి నాంది. సత్యం కాలంతో పాటు ప్రకాశిస్తుంది. నేను మన న్యాయవ్యవస్థను గౌరవిస్తాను. న్యాయం గెలుస్తుందని నా అచంచలమైన నమ్మకం. సత్యం కోసం నా పోరాటం కొనసాగుతుంది. త్వరలో ప్రపంచం కూడా దానికి సాక్ష్యమవ్వనుంది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మంత్రి లోకేశ్ సమక్షంలో సుజ్లాన్-ఏపీఎస్ఎస్‌డీసీ అవగాహన ఒప్పందం

మొదటి పేజి తరువాయి




భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. క్లీన్ ఎనర్జీలో జాతీయ, అంతర్జాతీయ అవకాశాల కోసం గ్లోబల్ నైపుణ్యాలను పెంపొందించడమే ఎంఓయూ ప్రధాన లక్ష్యం. విండ్ ఎనర్జీలో పేరొందిన సుజ్లాన్ సంస్థ ఇప్పటికే భారతదేశం, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో శిక్షణార్థులకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఈ కార్యక్రమంలో సుజలాన్ గ్రూప్ సీఈఓ జేపీ చలసాని, సీహెచ్ఆర్ఓ రాజేంద్ర మెహతా, టాలెంట్ మేనేజ్మెంట్ లీడ్ కమిలిని సన్యాల్, పాఠశాల విద్య, స్కిల్ డెవెలప్మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేశ్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "విండ్ ఎనర్జీ రంగంలో ఏపీ యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు పొందేందుకు సుజ్లాన్ తో చేసుకున్న ఒప్పందం దోహదపడుతుందని అన్నారు. ఒప్పందంలో భాగంగా 3 నుంచి 12 నెలల షార్ట్-టర్మ్, 12 నెలలకు పైగా లాంగ్-టెర్మ్ శిక్షణ ఇస్తారు. విండ్ ఎనర్జీ రంగ అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ కాలేజీల్లో వృత్తి కోర్సులు, ఎలెక్టివ్ ప్రోగ్రాములు నిర్వహిస్తారు. ఎంపిక చేసిన ఐటీఐ పాలిటెక్నిక్ కాలేజీల్లో స్కిల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. విండ్ ఎనర్జీ టెక్నాలజీలలో అధునాతన పరిశోధన, ఆవిష్కరణ, అనుభవజ్ఞాన శిక్షణ కోసం ఎక్సలెన్స్ సెంటర్లు స్థాపిస్తారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉపాధికి తోడ్పడే గ్లోబల్ సర్టిఫికేట్లు ప్రవేశపెడతారు. శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనా ల్యాబ్‌లలో ఆధునిక టెక్నాలజీలను అమలు చేస్తారు. సుజ్లాన్ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్‌ను విండ్ ఎనర్జీ నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. గ్లోబల్ స్థాయిలో ప్రతిభావంతులను తయారు చేసి, భారతదేశ క్లీన్ ఎనర్జీ రంగ ఆవిష్కరణలలో ఏపీని ముందు వరుసలో నిలబెడుతుంది. సుజ్లాన్ ఎనర్జీ స్కిల్ డెవలప్‌మెంట్ ఎండ్-టు-ఎండ్ డెవలప్‌మెంటల్, ఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను సమీకృతం చేసి విండ్ ఎనర్జీ సెగ్మెంట్ లో నైపుణ్యం, సామర్థ్యాలను మెరుగుపరుస్తుంది. స్కిల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఏపీలోని ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల నుంచి తగిన మౌలిక సదుపాయాలకు సుజ్లాన్ సహకారాన్ని అందిస్తుంది. పరికరాలను సేకరించడం, ఇన్‌స్టాల్ చేయడం, పరిశ్రమకు సమకాలీనమైన పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడం, ధృవీకరించబడిన శిక్షకులను సమీకరించడం. శిక్షకుల కోసం సామర్థ్య-నిర్మాణాన్ని అమలు చేయడం వంటి కార్యక్రమాలను సుజ్లాన్ చేపడుతుంది. పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా వరల్డ్ క్లాస్ సర్టిఫికేషన్ అందజేస్తుంది. పవన విద్యుత్ రంగంలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులకు మార్గం సుగమం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్‌కు సహకారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ఏపీలోని విండ్ పాకెట్ జిల్లాలు, చుట్టుపక్కల ఉన్న ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల నుంచి సరైన ఇన్‌స్టిట్యూట్‌లను గుర్తించి స్కిల్ ల్యాబ్‌ల ఏర్పాటును సులభతరం చేస్తుంది. అవసరమైన కోర్సు కంటెంట్, ఇతర సంబంధిత అనుమతులపై రాష్ట్ర, కేంద్ర అధికారుల నుంచి అవసరమైన అనుమతుల కోసం సహకారం అందిస్తుంది. జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాల కోసం విద్యార్థుల సమీకరణలో ఏపీఎస్-ఎస్‌డీసీ... సుజ్లాన్‌కు మద్దతు ఇస్తుంది. ప్రతిపాదిత సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి పర్యావరణ వ్యవస్థలను ప్రోత్సహిస్తుంది. అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలను అందించడానికి విద్యార్థులను స్థానిక పరిశ్రమలతో అనుసంధానిస్తుంది" అని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

# త్వరలో లక్ష మంది కూర్చునే స్టేడియం..!

మొదటి పేజి తరువాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, దేశంలోని అత్యంత ఆధునిక స్థాయిలో లక్ష మంది కూర్చునే సామర్థ్యం కలిగిన భారీ స్టేడియాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీలో లేదా మరో ప్రాంతంలో 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

విభిన్న మైదానాలు, ఆధునిక సదుపాయాలు

ఈ స్టేడియంలో అత్యాధునిక సాంకేతికతతో క్రికెట్, ఫుట్‌బాల్ వంటి వివిధ క్రీడలకు అనువైన మైదానాలను రూపొందిస్తారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ, మౌలిక సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా మార్చాలన్నది సీఎం రేవంత్ రెడ్డి దృష్టి.

భారతదేశంలో అతిపెద్ద క్రీడా మైదానం

ప్రస్తుతం గుజరాత్‌లోని మోతేరా స్టేడియం దేశంలోనే అతిపెద్దది, 1.32 లక్షల మంది సామర్థ్యంతో ఉంది. తెలంగాణలో నిర్మించబోయే ఈ కొత్త స్టేడియం గుజరాత్ స్థాయికి తగ్గదిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మైదానం అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు, ఐపీఎల్ మ్యాచ్‌లకు కేంద్రంగా మారుతుందని అంచనా.

ఆస్ట్రేలియా, సింగపూర్ పర్యటనల ప్రాధాన్యత

క్రీడాభివృద్ధిపై మరింత అవగాహన పొందేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్కడి క్రీడా మైదానాలు, శిక్షణా విధానాలు, ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు.

క్రీడారంగంలో తెలంగాణకు కొత్త ఒరవడి

తెలంగాణలో ఇప్పటికే 760 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్ రాష్ట్ర క్రీడారంగానికి దిశానిర్దేశం చేయనుంది. క్రీడలకు సంబంధించిన ప్రణాళికలు, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ, సమగ్ర విధానం అమలులోకి తెచ్చే యోచనలో ఉంది.

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు

20-24 తేదీల్లో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులపై కూడా చర్చించనున్నారు. తెలంగాణ క్రీడా రంగానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అయిన ఈ స్టేడియం, రాష్ట్రాన్ని క్రీడా భవిష్యత్తు కేంద్రంగా మార్చేందుకు సహాయపడుతుదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది .

# మరో ఇద్దరు చిన్నారులకు పాజిటివ్..
# భారత్‌లో క్రమంగా పెరుగుతున్న హెచ్‌ఎమ్‌పీవీ కేసులు



తాజాగా మహారాష్ట్ర నాగ్‌పూర్ లో మరో రెండు కేసులు నమోదయ్యాయి. ఏడు, 14 ఏళ్ల చిన్నారులకు హెచ్‌ఎమ్‌పీవీ పాజిటివ్‌గా తేలింది. జనవరి 3వ తేదీన చిన్నారులకు జ్వరం, దగ్గు రావడంతో నగరంలోని రాందాస్‌పేట్‌లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరికీ హెచ్‌ఎమ్‌పీవీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లలకు ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నారు. తాజా కేసులతో కలిపి భారత్‌లో మొత్తం హెచ్‌ఎమ్‌పీవీ కేసుల సంఖ్య ఏడుకు పెరిగింది. ఈ ఏడు పాజిటివ్ కేసుల్లో బాధితులంతా చిన్నారులే కావడం గమనార్హం. దీంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

అప్రమత్తమైన రాష్ట్రాలు

హెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎదురయ్యే వైద్యపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ ప్రభుత్వాలు సోమవారం మార్గదర్శకాలను జారీ చేశాయి. బెంగళూరులో రెండు హెచ్‌ఎంపీవీ కేసుల నేపథ్యంలో 'ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం' అంటూ కర్ణాటక అడ్వైజరీ జారీ చేసింది. జనం ఎక్కువ ఉన్న చోట్ల మాస్కులు ధరించాలని ప్రజలకు సూచించింది. హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదని, దేశంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు అసాధారణంగా పెరగలేదని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు వీడియో మెసేజ్ ద్వారా సూచించారు. కాగా, హెచ్‌ఎంపీవీతో పాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా న్యుమోనియా, కొవిడ్-19 కేసులు వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో చైనా స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించింది.

హెచ్‌ఎంపీవీ ప్రపంచమంతా ఉన్నదే: ఐసీఎంఆర్

హెచ్‌ఎంపీవీ ఇప్పటికే భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్నదని, ఈ వైరస్‌తో సంబంధమున్న శ్వాసకోశ సమస్యల కేసులు అనేక దేశాల్లో నమోదవుతున్నాయని ఐసీఎంఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ వద్ద ఉన్న ప్రస్తుత సమాచారంతో పాటు ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్(ఐడీఎస్‌పీ) డాటా ప్రకారం చూస్తే దేశంలో ఇన్‌ఫ్లుయెంజా లాంటి అనారోగ్య సమస్యల(ఐఎల్‌ఐ) లేదా తీవ్ర శ్వాసకోస సమస్య(ఎస్ఏఆర్ఐ) కేసుల సంఖ్య అసాధారణంగా ఏమీ పెరగలేదని వెల్లడించింది. కాగా, హెచ్‌ఎంపీవీ వైరస్ కొత్తదేమీ కాదని కర్ణాటక వైద్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. బాధిత శిశువులు ఎక్కడా ప్రయాణించలేదని, కాబట్టి ఇది బయటి నుంచి వచ్చిన వైరస్ కాదని అన్నారు. చైనాలో ఉన్నది కొత్త వేరియంట్ కావొచ్చని అభిప్రాయపడ్డారు.

ఇదేమీ కొత్త వైరస్ కాదు

ప్రతి శీతాకాలంలో ఈ కేసులు వస్తుంటాయని, నవంబర్ నుంచి తమ దవాఖానలో మూడు హెచ్‌ఎంపీవీ కేసులు గుర్తించామని, ఇవన్నీ తేలికపాటి వైరస్ కేసులేనని కోల్‌కతాలోని పీర్‌లెస్ హాస్పిటల్ సీఈవో సుదీప్త మిత్ర పేర్కొన్నారు. హెచ్‌ఎంపీవీ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఢిల్లీ ఎయిమ్స్ ఇంటర్నల్ మెడిసిన్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ తెలిపారు. కొవిడ్-19తో హెచ్‌ఎంపీవీని పోల్చవద్దని, కొవిడ్-19 అనేది పూర్తిగా కొత్త వైరస్ అని, దానిపై పోరాడగల రోగ నిరోధక శక్తి అప్పుడు ఎవరిలో లేదని అన్నారు. హెచ్‌ఎంపీవీ 2001 నుంచి ఉన్నదేనని చెప్పారు. పదేండ్ల వయసు వచ్చే నాటికి చాలావరకు పిల్లల్లో హెచ్‌ఎంపీవీకి వ్యతిరేకంగా పోరాడే రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాగా, హెచ్‌ఎంపీవీకి వ్యాక్సిన్ లేకపోయినా కొవిడ్ వ్యాక్సిన్ మూడు డోసులు లేదా ఫ్లూ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో హెచ్‌ఎంపీవీని ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి ఉంటుందని బెంగళూరులోని హెచ్‌సీజీ హాస్పిటల్ ఆంకాలజిస్ట్ విశాల్ తెలిపారు.

# కుప్పంలో సీఎం బిజీబిజీ..

మొదటి పేజి తరువాయి



మదర్ డెయిరీ ఫ్రూట్ విజిటబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.105.10 కోట్ల వ్యయంతో ఈ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. 4800 మందికి ఉపాధి దిశగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఫ్రూట్ పల్ప్ (మామిడి, టమోటా) తయారీ ద్వారా 50 వేల మంది రైతులకు ప్రయోజనం పొందేలా చర్యలు చేపడుతున్నట్లు మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయ తీర్థ చారి.. సీఎంకు వివరించారు. అలాగే చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబి గానిపల్లి, తంబి గానిపల్లి గ్రామం వద్ద 40 ఎకరాలలో ఏపీఐఐసీ ద్వారా శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాల పొడి తయారీ)కి భూమిని కేటాయించారు. దాదాపు రూ.233 కోట్లతో 4000 మందికి ఉపాధి కల్పించే విధంగా ఈ ప్రాజెక్టను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే లక్ష మంది మహిళా రైతుల భాగస్వామ్యంగా ఉన్నారని ముఖ్యమంత్రికి సీఈఓ తిమ్మప్ప, చైర్మన్ శ్రీదేవి వివరించారు. ఒకే రోజు 200 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసే సామర్థ్యం గల క్యాటిల్ ఫీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కుప్పం మున్సిపాలిటీలో అర్బన్ ప్రాజెక్టుల నిర్వహణ, అధికారుల అతిథి గృహాల నిర్మాణం కోసం సమీకృత కాంప్లెక్స్‌లో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ (2 అంతస్తులు) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీకే పల్లి పార్కుల అభివృద్ధి, సుందరీకరణ, కుప్పం ఏరియా అభివృద్ధిలో రోడ్డు జంక్షన్లు, వీధి దీపాలను ప్రత్యేక గ్రాంట్లతో రూ.60.20 కోట్ల అంచనా వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు. అలాగే రూ. 110.21 కోట్లతో కుప్పం నియోజకవర్గంలోని 451 డ్రైనేజీ వర్కులను, జీఎస్ హెచ్11- ఎస్‌డీపీ నిధుల ద్వారా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు.

### ఆరోగ్యశ్రీని వదిలించుకునే
# ప్రయత్నం జరుగుతోంది

మొదటి పేజి తరువాయి

కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. రూ. 3 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా, వైద్య సేవలు నిలిచే దాకా చూడటం అంటే... పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రగానే దీన్ని చూడాలని షర్మిల అన్నారు. ఆరోగ్య శ్రీ పథకానికి మంగళం పాడి... ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కత్తిపీట వేస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ... వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పథకానికి బకాయిలు గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టినవే అయినా... వాటిని చెల్లించే బాధ్యత మీ ప్రభుత్వంపైనే ఉంది. వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవండి. పెండింగ్ బకాయిలు రూ. 3 వేల కోట్లు తక్షణం విడుదల చేయండి. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏ లోటూ రాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల చెప్పారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు.

# తప్పు చేసినట్టుగా హైకోర్ట్ చెప్పలేదన్న హరీశ్ రావు

ఈ-రేస్‌తో రాష్ట్రానికి లాభం జరిగిందని, నష్టం జరగలేదని ఆయన పేర్కొన్నారు. అసలు అవినీతే జరగనప్పుడు ఈ కేసుకు ఆస్కారం ఎక్కడ ఉంటుందని హరీశ్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని, అక్రమ అరెస్టులతో ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవాలని రేవంత్ భావిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. అవినీతి జరగలేదని, గ్రీన్ కో కంపెనీకి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని అన్నారు. ఈ కేసు వ్యవహారంలో సుప్రీంకోర్టు అప్పీలుకు పోవాలా? లేదా? అనేది న్యాయవాదుల సలహా మేరకు నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి బీఆర్ఎస్ నేతలు తరలి వెళ్లారు. అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. మరోవైపు, ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణలో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో ఏ3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ నివాసంలో కూడా సోదాలు జరుగుతున్నాయి. వీరిద్దరూ గురువారం ఈడీ విచారణను ఎదుర్కోనున్నారు.

# మంత్రి ఆదేశాలతో కదిలిన కల్వర్టు పనులు



సంతమాగులూరు, (శుభోదయం న్యూస్): మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో రోడ్డు పక్కన ఉన్నటువంటి కల్వర్టు పగిలిపోవటంతో గ్రామానికి చెందిన దూళిపాళ్ల వేణుబాబు మంత్రి రవికుమార్ కు ఇటీవల వినతి అందించారు. స్పందించిన మంత్రి పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావుని పిలిపించి వెంటనే కల్వర్టుపనులు ప్రారంభించాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు నాగేశ్వరరావు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోరంట్ల ఎల్లమంద వెంటనే కల్వర్టు పనులను మంగళవారం పనులు ప్రారంభించారు. బుధవారం సాయంత్రానికి ఈ కల్వర్ట్ పనులు పూర్తి చేస్తామని వారు తెలిపారు.

# శ్రీవారి సేవలో ఎస్పీ



వెంకటగిరి, నియోజకవర్గ ఇన్చార్జ్ : వీ సీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుమల తిరుమలలో మంగళవారం బ్రేక్ దర్శనం సమయంలో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు ఆయనతో పాటు తదితరులు ఉన్నారు 2022 23వ సంవత్సరం తిరుపతి జిల్లా ఎస్పీగా పని చేసిన పరమేశ్వర్ రెడ్డి

## ఎర్రచందనంపై నిఘా పటిష్టం
## అటవీశాఖతో కలసి మాస్ కూంబింగ్ ఆపరేషన్లు

### పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడం
### అటవీ అధికారులు సమన్వయ సమావేశంలో ఎర్రచందనం
### అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్



(శుభోదయం న్యూస్) : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక చర్యల్లో భాగంగా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు గారి సూచనల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ శ్రీనివాస్ గారు అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సంయుక్త సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పెంచలకోన, సోమశిల, లంకమల అటవీ ప్రాంతాలలో పర్యటించారు. పెంచలకోన, బద్వేలు, సిద్దవటం, రైల్వే కోడూరు లలో ఈ సమావేశాలను సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయింట్లు వద్ద నిఘా పటిష్టం చేయాలని సూచించారు. అటవీశాఖ చెక్ పోస్టులలో సిబ్బంది కొరత లేకుండా, తగు మౌలిక సదుపాయాలతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. భవిష్యత్తులో టాస్క్ ఫోర్స్ అటవీ శాఖతో కలసి ప్రత్యేక మాస్ కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తామని అన్నారు. పాత నేరస్తుల పై సాంకేతిక వ్యవస్థ తో నిఘా ఉంచి, నేరాలకు మళ్లీ పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశాల్లో డీఎస్పీలు శ్రీ జి. బాలిరెడ్డి, శ్రీ వీ. శ్రీనివాసులు రెడ్డి, ఏసీఎఫ్ శ్రీ జె. శ్రీనివాస్, ఇతర టాస్క్ ఫోర్స్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



# కనిపించడం లేదు

(శుభోదయం న్యూస్) : పిడుగురాళ్ల పట్టణానికి చెందిన బైరపోగు వెంకటేశ్వర్లు అనే ఈ యువకుడు మూడు రోజులుగా కనిపించడం లేదు ఇతని ఆచూకీ తెలిసిన వాళ్లు ఈ క్రింది నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరుచున్నాము 9063138333 . 8179985999

## టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలి : మేకపోతుల శ్రీనివాసరెడ్డి

### ఏడు నెలలు గడిచిన అమలుకు నోచుకోని కిట్కో గృహాలు



మాచర్ల నియోజకవర్గం ఇంచార్జ్ - వేల్పుల చిన్న గురవయ్య, (శుభోదయం న్యూస్): అసంపూర్తిగా ఉన్న టిట్కో ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే అందించాలని సిపిఐ మాచర్ల ఏరియా సెక్రెటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కొమెర వీరాస్వామి భవన్ లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాటి చంద్రబాబు ప్రభుత్వంలో టిడ్కో ఇండ్లు 70% పూర్తయ్యాయని, 2019 తర్వాత మాజీ సీఎం జగన్ వాటిని పూర్తిగా విస్మరించాడన్నారు. తర్వాత 2024 ఎన్నికల ముందు నాటి ప్రతిపక్ష నేతగా నేటి సీఎం చంద్రబాబు తాము అధికారంలోకి రాగానే అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇస్తానన్న హామీ 7 నెలలు గడిచినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాలలో 2 సెంట్లు గ్రామాలలో 3 సెంట్ల స్థలాన్ని కేటాయించి, వాటి నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున కేటాయించి, సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే లక్ష్యం మంటూ ప్రగల్బాలు పలికే పార్టీల నాయకులు ఆ తర్వాత మాట తప్పడం అలవాటుగా మారిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి టిట్కో ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ సెక్రటరీ మిద్దెపోగు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీది విధ్వంసం.. మాది అభివృద్ధి పథం : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఉద్ఘాటన



రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు, విధ్వంసాలకి సజీవ సాక్ష్యాలతో శాపగ్రస్తమై, అప్రతిష్ఠ పాలై చరమాంక దశలో ఉన్న వైసీపీ పార్టీకి నిండు నూరేళ్లు నిండాయని మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతలలో పర్యటించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్ లోని టీడీపీ ముఖద్వారం పునర్నిర్మాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైసీపీ విధ్వంసానికి సజీవ సాక్ష్యంగా నిలిచి కూల్చివేతకు గురైన ముఖద్వారం పునర్నిర్మాణానికి టీడీపీ నేత గొంటు ఆదిరెడ్డి పూనుకుని నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. వైసీపీ గుండాలకు విధి విధానాలు మార్చుకుంటారని ఆరు నెలలు సమయమిచ్చాం, తీరు మారకుంటే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే తీవ్రంగా హెచ్చరించారు. ఇప్పుడు తాము అధికారంలో ఉన్నా గత ప్రభుత్వ విధ్వంస పరిపాలన ఆనవాళ్ళు చెరిపివేయాలి, వ్యవస్థల్ని చక్కదిద్దాలి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్న దృఢ సంకల్పంతో ఉన్న ప్రియతమ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు తాము వ్యవహరిస్తున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు ఆర్థిక లోటుతో రాష్ట్రాన్ని ముంచితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టాలని వృద్ధాప్యం మరచి రాష్ట్ర శ్రేయస్సుకు



అహర్నిశలు పాటుపడుతూ మమ్మల్ని కూడా అదే బాటలో సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యలపై స్పందిస్తూ ముందుకు సాగాలన్న చంద్రబాబు ఆదేశం మేరకు తాము పని చేస్తుంటే అది చేతకానితనంగా భావించే అవాకులు చెవాకులు మాట్లాడే వైసీపీ నాయకులకు, లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా సృష్టించే సోషల్ మీడియాకు ఒక్కసారి సైగ చేస్తే మిమ్మల్ని తుక్కురేగ కొడతారని, కానీ చట్టాన్ని గౌరవించి పనిచేసే, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించే వాళ్ళము కాబట్టే మీరు ఈ ఆరు నెలలు స్వేచ్ఛగా తిరిగారన్నారు. గత ప్రభుత్వంలో మీరు చేసిన దోపిడీలు, దుర్మార్గాలు, వేధింపులు,దౌర్జన్యాలు, రౌడీయిజాన్ని పల్నాటి ప్రాంత ప్రజలు జీవితాంతం ఎప్పటికీ మర్చిపోరని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని వైసీపీ నాయకులను, గుండాలను, రౌడీలను హెచ్చరిస్తున్నానన్నారు. చట్ట పరిధిలో తప్పు చేసిన ప్రతి ఒక్కరికి వడ్డన తప్పకుండా ఉంటుందన్నారు. రైతుల భూములు దోపిడీ చేసి వరికపుడిశెల ప్రాజెక్టు తేకపోతే శాశ్వతంగా రాజకీయాలను తప్పుకుంటానని సవాలు చేసిన రామకృష్ణారెడ్డి సిగ్గుందా నీకు? గత ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయం సన్యాసం తీసుకుంటానని అన్నమాట నీకు గుర్తు లేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ సిగ్గులేని నాయకుడా మీకు ఆదర్శం వైసీపీ నాయకులారా? నేటికీ శాంతియుతంగా ఉంటే పల్లెల్లో మా పార్టీ వాళ్ళ పై దౌర్జన్యాలు చేస్తారా? ఖబడ్దార్ ఒక్కొక్కరి సంగతి తేలుస్తా ఒళ్ళు దగ్గర పెట్టుకుని మసలుకోండి, ఒక్క అవకాశం ఇస్తే మీరు ఊరు వదిలి పారిపోతారు కానీ సమాజం ప్రశాంతతను కోరుకునే వ్యక్తిని కాబట్టే పల్నాడులో ఫ్యాక్షనిజన్ని తగ్గించే దిశగా ప్రయత్నిస్తున్నామన్నారు. సమాజంలోని అన్ని మతాల, వర్గాల, కులాల, వివిధ పార్టీలకు చెందినవారికి న్యాయం జరగటమే సామాజిక న్యాయం అన్నారు. వైసీపీ అనాలోచిత, దుర్మార్గ చర్యలతో ఆరోగ్యశ్రీ అటకెక్కే పరిస్థితి నెలకొందని, ఫీజు రియంబర్స్మెంట్ పరిస్థితి అలాగే ఉందని, డ్వాక్రా మహిళలు పొదుపు చేసుకున్న సొమ్మును కూడా దోచుకున్న దొంగలు మీరు రైతు సమస్యల పట్ల, విద్యుత్ సమస్యల పట్ల ఆందోళనలు చేస్తారా? మీకు సిగ్గు వేయడం లేదా అని దుయ్యబట్టారు. మీ చేతకానితనం, అరాచకత్వం తో ఈ రాష్ట్రం ఏ విధంగా నష్టపోయిందో చర్చకు రావడానికి తెలుగుదేశం సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. రైతులకు ఒక్క ఎకరా కూడా నీళ్లు ఇవ్వక, ఏడుసార్లు విద్యుత్ ఛార్జీల భారం మోపి ప్రజా సంక్షేమం పట్టని వైకాపా ప్రభుత్వం ఇకపై రోడ్లెక్కి ధర్నాలు చేస్తే వైసీపీ నాయకులను అక్కడే నిలదీస్తానని ఆయన హెచ్చరించారు. మీకు ధైర్యం ఉంటే ధర్నాకు రండి.. మీకు మేము ఎదురొస్తాం.. అక్కడే తేలుద్దాం.. మీరు అసత్యాలు మాట్లాడుతుంటే మేము చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. మీరు ఇంకొకసారి వస్తే ఫేస్ టు ఫేస్, జాతీయ స్థాయిలో గాని, రాష్ట్రస్థాయిలో గాని మీ అక్రమాలను బయట పెట్టడానికి తెలుగుదేశం సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియపరుస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి, ఏపీ శిల్పారామం ఛైర్మన్ మంజులరెడ్డి, సీనియర్ నేత దండే శివయ్య, గొంటు సుమంత్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి,బోడపాటి రామకృష్ణ, నియోజకవర్గం ఎస్సీ కన్వీనర్ మామిడి రవి, సిద్దయ్య, షేక్ బుజ్జి, దుగ్గింపూడి ఇన్నారెడ్డి, తుమ్మా జోజి రెడ్డి, ఏచూరి వెంకట సైదయ్య, నాళం బాబు, ముని నాయక్ తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థినిలకు 400 భోజనం ప్లేట్లు
## ఉచితంగా అందజేసిన రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల





(మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ ) వేల్పుల చిన్న గురవయ్య, శుభోదయం న్యూస్-రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారి ఆధ్వర్యంలో ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ బాలయ్య , వేణు ప్రధానోపాధ్యాయిని సఖినా బేగం అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కార్యక్రమంలో ఎస్.కే. బి. ఆర్. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, దుర్గి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు 400కు పైగా మధ్యాహ్న భోజనానికి అవసరమగు స్టీల్ ప్లేట్లను ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కళాశాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని రోటరీ 3150 డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్, విద్యార్థుల హాజరుతోపాటుగా ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుందని, ప్రోగ్రాం కన్వీనర్ నాగుర్ వలి, ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సత్య ప్రసాద్,రాధ, ఇక్కుర్తి శంకర్, ఆలేటి కోటేశ్వరరావు, మస్తాన్ వలి, బంగారు బాబు, కర్నాటి శ్రీనివాసరావు,చిట్టేటి నాగేశ్వరరావు , ఇక్కుర్తి కనక శ్రీ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## మా భూములు మాకు ఇప్పించండి సారూ...



(మాచర్ల నియోజకవర్గం ఇంచార్జ్ ) వేల్పుల చిన్న గురవయ్య, (శుభోదయం న్యూస్) : అబ్రహాం లింకన్ ఆక్రమణలకు గురైన మాదిగల భూములను కాపాడాలని ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు పోలేపల్లి అబ్రహాం లింకన్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గి మండలం జంగమేశ్వర పాడు గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగలైన కందుల చిన్న సామ్యేల్,మరికొందరిభూములను ఆక్రమించి వారి సొంత భూములుగా అగ్రవర్ణాలు కమ్మ కులస్తులైనటువంటి మాగులూరి పెద ఏగి రామయ్య, మాగులూరి శ్రీనివాసరావులు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గతంలో ఆ భూమికి సంబంధించిన సర్వే నెంబర్లలో కందుల చిన్న సామ్యేల్ యొక్క తాత కందుల వెంకయ్య తండ్రికొండలు వీరికి సంబంధించిన ఆస్తిని వెంకయ్య కొడుకు, పురుషోత్తానికి చెందవలసిన ఆస్తిని మనవళ్లుగా పురుషోత్తం కొడుకులు బాగ పంపిణీ చేసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా 738/2ఏ, 738/2బి సర్వే నెంబర్ల లో ఉన్న 5 ఎకరాల 51 సెంట్లు భూమిని కాజేశారని, చిన్న సామ్యేలుని ఆఫీసుల చుట్టూ తిప్పుతూ న్యాయం చేయకుండా తిప్పుతున్నారని అన్నారు.దుర్గి ఎమ్మార్వో బాదితులకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలకి శ్రీకారం చుట్టవలసి వస్తుందని అబ్రహాం లింకన్ హెచ్చరించారు.

## అన్ని బోయినపల్లి విఆర్ కోట పొలం పిలుస్తుంది కార్యక్రమం



లింగసముద్రం సురేష్ (శుభోదయం న్యూస్ ): లింగసముద్రం మండలంలో అన్ని బోయినపల్లి విఆర్ కోట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఏవో అబ్రహం లింకన్ మాట్లాడుతూ పత్తిలో మంచి దిగుబడులను సాధించుటకు ఒక ఎకరమునకు 750 గ్రాముల విత్తనములు సరిపోతుంది విత్తనం శుద్ధికరణ కోసం ఒక కేజీ విత్తనమునకు 10 గ్రాముల ట్రైకోడెర్మియా విరిడియా ద్వారా శుద్ధి చేసుకోవాలని తెలిపారు. పశువైద్య సహాయక ఎస్ కే రుపియా మాట్లాడుతూ సీజన్లో వ్యాధులు ప్రబలకుండా పశువులకు టీకాలు వేయించుకోవాలని బహుజాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్ కే నజీర్ ఎస్ కే అహ్మద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ సబ్సిడీ, రుణాల కోసం బీసీలు,
## ఈబీసీలు దరఖాస్తులు చేసుకోండి - ఎంపీడీఓ నాసర్ రెడ్డి



దోర్నాల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్): 2024-25 సంవత్సరానికి సంబంధించిన బీసీ కార్పొరేషన్ ఇచ్చే సబ్సిడీ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు ఈ నెల 8వ తేదీ నుంచే దరఖాస్తులు చేసుకోవాలని దోర్నాల నాసర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా ఏస్, వెదురు బుట్టల తయారీ, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దోర్నాల మండలానికి బీసీలకు 23 యూనిట్లు, ఈబీసీలకు 11 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలు సచివాలయాల నందు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండలంలోని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు...!!

## బింగినపల్లి మరియు
## మూలగుంటపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ మండలం బింగినపల్లి మరియు మూలగుంటపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమమును నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. సుధాకర్ మాట్లాడుతూ పథకం కింద వరి పంటకు బీమా చేయించుకోవటానికి జనవరి 15 వరకు పొడిగించడం జరిగినది ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలియజేసినారు.పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవలసినదిగా తెలియజేసి ఉన్నారు మరియు ప్రకృతి వ్యవసాయం లో భాగంగా సి ఆర్ పి వెంకటరమణ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం గురించి మరియు జిగురు అట్టలు,లింగాకర్షణ బుట్టలు గురించి రైతులకు అవగాహన కల్పించినారు. తదుపరి వరిలో క్షేత్ర పరిశీలన చేయడం జరిగినది ముఖ్యంగా చల్లటి వాతావరణం వల్ల అగ్గి తెగులు మరియు ఆకు ముడత గమనించడం జరిగినది అగ్గి తెగులు నివారణ కొరకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి , ఆకు ముడత నివారణకు క్లోరిపైరిపాస్ 20 ఇ సి 500 మి లీ ఎకరానికి పిచికారి చేసుకొనవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జహీర్ మరియు గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రీ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో తూర్పు రొంపి దొడ్ల సర్పంచ్ చల్లా నాగేశ్వరికి గ్రామస్తుల అభినందనలు





ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్):ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం తూర్పు రొంపి దొడ్ల గ్రామంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాలతో సర్పంచ్ చల్లా నాగేశ్వరి లక్ష్మీ నరసయ్య ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నది. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి లో కాకర్ల సురేష్ మార్కు స్పష్టంగా కనిపిస్తున్నదని ఆమె అన్నారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సేవలు,నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతుందని సమర్థవంతమైన నాయకత్వం వలన గ్రామాల్లో మౌలిక వసతులు, విద్యా వైద్యం సమపాళ్లలో అందుతున్నాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా నాగేశ్వరి లక్ష్మీ నరసయ్య టిడిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# టంగుటూరులో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుల ముగింపు కార్యక్రమం!





టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) :- రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రామ రెవెన్యూ సదస్సుల ముగింపు కార్యక్రమం టంగుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల రెవెన్యూ అధికారి జి ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతం చేసినందుకుగాను మండల ప్రజలకు రెవిన్యూ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో వీలైనంతవరకు వచ్చిన అర్జీలను స్వీకరిస్తూ ఇతర స్థానిక సమస్యలను ఆయా గ్రామస్తులతో చర్చించి వారి సహకారంతో సత్వరం పరిష్కారం చేయడం జరిగిందన్నారు.ఈ క్రమంలో మంగళవారం టంగుటూరులో జరిగిన రెవిన్యూ సదస్సులో పాస్ పుస్తకాలకు 5 అర్జీలు రీప్లేస్మెంట్ పాస్ పుస్తకాలకు 1 అర్జీలు మొత్తం 6గా నమోదైనట్లు సంబంధిత రెవెన్యూ సిబ్బంది తెలియజేయడం జరిగింది. అదేవిధంగా గత 2024 డిసెంబర్ 6న ఈ రెవెన్యూ సదస్సుల పరంపర మొదలై 2025 జనవరి 7తో ముగిసిందన్నారు. రెవిన్యూ సమస్యలకు సంబంధించి మొత్తం 439 అర్జీలు వచ్చాయని వాటిలో సత్వరమే పరిష్కరించబడినవి 50 కాగా పరిష్కరించాల్సినవి 389 గా ఉన్నాయన్నారు. ఇదిలా ఉండగా 17 రెవిన్యూ గ్రామాలకు గాను 19 గ్రామ సభలు జరిగాయని సంబంధిత రెవెన్యూ సిబ్బంది ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపింది. ఈ కార్యక్రమంలో ఈ ఓ వరదారెడ్డి సర్వేర్ నందయ్య ఆర్ఐ హనుమంతరావు డిటి శ్రీనాథ్ వారి సిబ్బంది మరియు స్థానిక మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు ఉప సర్పంచ్ కామని వెంకట్రావు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ టిడిపి మండల అధ్యక్షులు కామని విజయ్ కుమార్ టిడిపి పట్టణ అధ్యక్షులు కామని నాగశ్రీను టిడిపి సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు మక్కెన కోటేశ్వరరావు తదితరులు మరియు సచివాలయ సిబ్బంది గ్రామ రైతులు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# బన్నీ పుష్ప 1 పుష్ప 2లే కాదు మరెన్నో పుష్పాలు....? తగ్గేదేలేజిఅంటున్న పుష్పాలు



ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్): ఏదైనా జంతువు చనిపోతే గద్దలు, రాబందులు వాసన పసిగట్టి చనిపోయిన జంతువు వద్ద వాలిపోతాయి. అది వాటికి ప్రకృతి ప్రసాదించిన వరం. అదేమిటో కానీ జామాయిల్ చెట్టు వాసన వస్తే చాలు అంతకుమించిన రాబందులు రాత్రికి రాత్రే వచ్చి వాలుతారు. అసలు విషయం ఏమిటంటే ఆ రాబందులకు మాత్రమే తెలుస్తుంది జామాయిల్ వివరాలు, ఎవరి చేత నరికించాలి, ఎవరికి అమ్మాలి అనేవి. ఈమధ్య బ్లాక్ బస్టర్ అయిన పుష్ప మూవీ తరహాలో తగ్గేదేలే అంటూ లక్షలు దాటి కోట్లకు చేరుకుంటున్నారు. పామూరు మండల పరిధిలోని కోడిగుడ్లపాడు వద్ద సోమవారం రాత్రి అక్రమంగా జామాయిల్ కర్రను తరలిస్తున్న కొందరు వ్యక్తులపై పొలం యజమానులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదు పై విచారిస్తున్న పోలీసులు.

# టంగుటూరులో ఆక్రమణలకు గురైన భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలి! - సిపిఐ డిమాండ్

### సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) :- టంగుటూరు రెవిన్యూ గ్రామంలో ఆక్రమణకు గురైన భూములను ఆక్రమణదారుల చర నుండి విడిపించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఐ టంగుటూరు మండల కార్యదర్శి టీ ప్రభాకరరావు మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరు రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 509 లో 23.22 ఎకరాలు, సర్వే నెంబర్ 519 లో 23.20 ఎకరాలు, సర్వే నెంబర్ 547 లో 4.00 ఎకరాల విస్తీర్ణంలోని చలివేంద్ర మాన్యాలు, ధర్మ కుంట ఆక్రమణలకు గురై ప్రజలకు దాహార్తి తీర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కనుక ఈ పరిస్థితులకు కారకులైన వీఆర్వో , విలేజ్ సెక్రటరీలపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ప్రభాకర రావు డిమాండ్ చేయడం జరిగింది. తదనంతరం సంబంధిత రెవెన్యూ అధికారి జి ఆంజనేయులుకు వినతి పత్రం సమర్పించడం జరిగింది.

# కులగణనా పాడుగాను హిందూ మాదిగను, హిందూ క్రిస్టియన్ గా గణించడం మాదిగలకు అన్యాయమే



ఎర్రగొండపాలెం, మండల్ రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్):కలగణన పేరుతో ఇక్కడి అధికారులు ,సచివాలయాలసిబ్బంది , హిందూమాదిగలను ,హిందూక్రిష్టియన్ గా ఎక్కించడం అన్యాయమని దళిత సంఘ నేత రాచేటిప్రసాద్ ద్వజమెత్తారు .....యర్రగొండపాలెం పట్టణ తహాశీల్దారు కార్యాలయ ఆవరణలో జరిగిన నిరసన కార్యాక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొని మాదిగలకు న్యాయం చెయాలని వినతి పత్రం అందించారు ....అనంతరం కార్యాలయం ఎదురు నిరసన తెలిపారు , ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సంఖ్యాపరంగా మాదిగలు ఎక్కువగా ఉన్న యర్రగొండపాలెం పట్టణంలో పేర్లను మార్చి క్రిష్టియన్ గా ఎక్కిస్తున్నారని సచివాలయం రెండు పరిధిలో 700 మందికి పైగా హిందూ మాదిగలుగా ఉంటే దాదాపుగా 500 మందికి పైగా హిందూక్రిష్టియన్ గా జాబిత తయారు చెయడం తగదని అన్నారు .... సచివాలయాల ముందు జాబితా ప్రకటించాల్సిఉన్నా సిబ్బంది జాబితాను బయట పెట్టక పోవాడం ఎంటని ప్రశ్నించారు దీనిపై తహాశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు ...ఈ కార్యాక్రమంలో మాదిగలతో పాటు నాయకులు సుబ్బయ్య , వెంకటయ్య పాల్గొన్నారు.

# నిరుపేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు, అనాథలకు, యాజకులకు భోజన పంపిణీ



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):కూటి కోసం కోటి తిప్పలు అన్నదే పెద్దల మాట, ఎంతోమంది నిరుపేదలు ఎన్నో కష్టాలు అనుభవిస్తూ ఆకలి తీర్చుకోలేని అభాగ్యులు ఎందరో మనదేశంలో ఉన్నారు. అలాంటివారికి మన కనిగిరి ప్రాంతంలోనే దివ్యాంగులు, వృద్ధులు, అనాథలు, నిరుపేదలు, యాచకులు మొదలగు వారికి శ్రీ సాయి కృష్ణ దివ్యాంగుల సంక్షేమ సంగం బృందం మా వంతుగా ప్రతిరోజు



ఒక్కరికైనా ఆకలి తీర్చాలి అనే ఉద్దేశంతో అన్నదాత సుఖీభవ అనే కార్యక్రమాన్ని చేపట్టిన సంస్థని చూసి కనిగిరి డివిజన్ ప్రాంతంలోనే హనుమంతునిపాడు మండలం వాలి చర్ల గ్రామమునకు చెందిన కూదలి శ్యాము పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు కూడలి ఇమానీలు, కూడలి ఇవాంజలి గార్లు శ్రీ సాయి కృష్ణ దివ్యాంగుల ఆశ్రమ బృందానికి 25 కేజీల బియ్యం సరుకులు అందజేసి ఉన్నారు. వారికి దివ్యాంగుల సమస్థ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

రెంటచింతల, మండల రిపోర్టర్- శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని పాల్వాయి గ్రామ సమీపంలోని కోడి పందేల స్థావరంపై మంగళవారం సాయంత్రం రెంటచింతల పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్సై నాగార్జున వారి సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లి కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 17 బైకులు,రూ.9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పలువురు సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.

# ఆర్ టి సి డ్రైవర్ ను పరామర్శించిన మున్సిపాలిటీ ఛైర్మన్



కనిగిరి రిపోర్టర్ - జి ప్రసాదరావు (శుభోదయం న్యూస్): ఏపీఎస్ఆర్టీసీ కనిగిరి డిపోలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ బస్సు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న ఎస్ కె ఖాజా సాహెబ్ డ్రైవర్ ని మంగళవారం కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ వారి గృహంను సందర్శించి డ్రైవర్ ని కుటుంభం సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించారు. తన వంతు ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తానని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదానికి గురైనప్పుడు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేయాలని కోరారు.ఆయన వెంట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కనిగిరి యూనిట్ ప్రెసిడెంట్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్ ను పరిశీలించిన మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాదరావు, (శుభోదయం న్యూస్): కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని తీగల గొందిలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 5 రూపాయలు చెల్లించి, టోకెన్ తీసుకొని అన్న క్యాంటీన్లో స్వయంగా భోజనం చేసి, సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరిపై రూ.50 రూపాయల సబ్సిడీని భరిస్తూ , పేదలకు 5 రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా అన్నం పెడుతూ వారి ఆకలి తీర్చడం అభినందనీయమన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా మరింత నాణ్యతగా పేదలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని పట్టణంలోని అన్న క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రతగా ఉంచేందుకు మున్సిపాలిటీ తరపున అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# చట్టబద్ధతలేని ఎస్సీ వర్గీకరణకు మేము వ్యతిరేకం!- మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుళ్లిబిల్లి అశోక్



టంగుటూరు మండల రిపోర్టర్ :o వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెన్షన్ల పంపిణీకి వెళ్లిన ప్రాంతంల్లో ఎస్సీ వర్గీకరణ జరుగుతుంది మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెబుతూ మరో ప్రక్క ఎస్సీ వర్గీకరణ పై అభిప్రాయాలు సేకరించడం కోసం వన్ మెన్ కమిషన్ ఆర్ ఆర్ మిశ్రాను నియమించి ఎస్సీ ప్రజల్నీ యావత్తు రాష్ట్రాన్ని మోసం చేయడమేనని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టి అశోక్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ మాలలు విద్య అనేది పరమావధిక భావించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో కష్టపడి చదువుకుని ఉద్యోగులు తెచ్చుకున్నారని ఎవరినీ మోసం చేయలేదన్నారు. ఈ విషయాన్ని కమిషన్ గుర్తించాలన్నారు. మాదిగలకు చదువుతో సంబంధం లేకుండా ఆర్థిక సంపాదనకు అవసరమైన వృత్తులు ఉండడం వల్ల మాత్రమే వారు చదువులో వెనుకబడ్డారని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఇదిలా ఉండగా ఒంగోలు కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో ఈ విషయంపై మరియు పలు అంశాలపై ఏకసభ్య కమిషన్ సభ్యులకు తెలియజేస్తూ సంబంధిత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించాలని ఆయన కోరడం జరిగింది.

# వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జిల్లా (శుభోదయం న్యూస్): సమాజంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల ను ప్రభుత్వం పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ సన్నెబోయిన నాగేశ్వర రావు అన్నారు. వికలాంగుల సమస్య లపై మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు సమాజంలో పడుతున్న ఇబ్బందులు గుర్తించి ప్రభుత్వం, అధికారులు చొరవతీసుకొని సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా కోరారు.వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశాలకు సహకరించిన గంజి సుబ్బారావు, ఆర్ఎంపీ వైద్యులు సుబ్బారావు, పసుపులేటి శేషారావులకు కమిటీ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆరేటి వేణు తదితరులు పాల్గొన్నారు.

# బాదిత కుటుంబానికి అండగా 5 లక్షల చెక్కును పంపిణీ చేసిన - మంత్రి స్వామి



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- కొండపి నియోజకవర్గం చిర్రికూరపాడు గ్రామానికి చెందిన ఇట్టా వెంకట్రావు గత సంవత్సరం విద్యుత్ షాక్కు గురై మృతి చెందడం జరిగింది. ఈ క్రమంలో బాదిత కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఐదు లక్షల రూపాయలు చెక్కును రాష్ట్ర సంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి మంగళవారం బాధితుల చెక్కును పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి గొట్టిపాటి రవి కుమార్, మంత్రి బాల వీరాంజనేయలకు స్వామిలకి బాదిత కుటుంబ సభ్యులు చిర్రికూరపాడు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచొద్దు ఆన్లైన్ ప్రజాభిప్రాయ సేకరణలో సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ఏఎస్ ఆర్ జిల్లా- చింతపల్లి /):ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచొద్దని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ విద్యుత్ నియంత్రణ మండలిని కోరారు. మంగళవారం ఆయన విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించిన ఆన్లైన్ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను విద్యుత్ నియంత్రణ మండలికి విన్నవించారు. గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ డిస్కంలు సమర్పించిన ఏఆర్ఆర్, టారీఫ్ ప్రతిపాదనాలకు అభ్యంతరాలు సూచనలు తెలియజేశామని అన్నారు. 2025-2026 సంవత్సరానికి రెవెన్యూ గ్యాప్ గా చూపించిన 5538.26 కోట్ల భారాన్ని వినియోగదారుల మీద మోపకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని అన్నారు. స్మార్ట్ డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేస్తే టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని అమలు చేయటం, చార్జిలా వసూళ్లలో పారదర్శకత లేకపోవడం, ప్రీపెయిడ్ విధానాన్ని కలిగి ఉండక పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు.

## 43వ డివిజన్లో టియుఎఫ్ ఐడిసి నిధులతో
## సిసి రోడ్ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్): ఎన్నికల సమయంలో ప్రచారంలో బాగంగా మన శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని వీది లో ఈ రొజు మన రామగుండం ఎమ్మెల్యే గారి ఆదేశాలతో ఈ రోజు స్థానిక 43 వ డివిజన్ లో 80 లక్షల రూపాయలతో సీసీ రోడ్ వేయడం జరుగుతుంది.కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఈ రోజు రామగుండం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి గారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది.సందర్భంగా మాట్లాడుతూ ఇన్ని నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తున్న రామగుండం శాసనసభ్యులు గౌరవ శ్రీ %వీ.ా% రాజ్ ఠాగూర్ అన్న గారికి 43 వ డివిజన్ ప్రజల పక్షాన కృత్ణతలు తెలియజేసారు అదేవిధంగా రామగుండం నియోజకవర్గం లో ఎలాంటి సమస్య ఉన్న ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



అన్నగారి దృష్టికి కాంగ్రెస్ పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు గౌరవ సీఎం రేవంత్ రెడ్డి గారు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గారు స్థానిక మంత్రివర్యులు శ్రీధర్ బాబు గారు సూచనల సలహాలతో ఈ ప్రాంత శాసనసభ్యులు గౌరవ శ్రీ రాజ్ ఠాగూర్ అన్నగారు పూర్తిస్థాయిలో అభివృద్ధిలోకి తీసుకువస్తున్నారని అన్నారు అదేవిధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో పూర్తి పారిదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. ఎమ్మెల్యే గారి పరిపాలనలో ఎలాంటి అవినీతి తావు లేకుండా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడమే కాంగ్రెస్ పార్టీ మరియు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ గారి ధ్యేయం అన్నారు.అనంతరం బిసి సెల్ అధ్యక్షులు గట్ల రమేష్ మాట్లాడుతూ రోడ్డుకు సహకరించి వేడెల్పుకు సహకరించిన 43 వ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు రామగుండం నియోజకవర్గం లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు రామగుండం నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు అదేవిధంగా గత పాలకులు చేయడం వలన రామగుండం నియోజకవర్గం వెనుకబడిన విషయం ప్రతి ఒక్కరు కూడా గమనించాల్సిన అవసరం ఉంది ఎన్నడూ లేని విధంగా నిరంతరం ప్రజల పట్ల చిత్తశుద్ధితో అభివృద్ధిని ముందడుగులో నడిపిస్తున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ అన్న గారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగుస్వామి గారు,పాత పెల్లి ఎల్లయ్య గారి,ముస్తఫా గారు 43 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సొల్లు రామస్వామి, రామకృష్ణ, స్వరాజ్ , అడప కృష్ణ,మంతెన శ్రీకాంత్,మరియు పెద్ద ఎత్తున డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ రామగుండం కార్పొరేషన్ అడ్ హక్ కమిటీ ఎన్నిక
## ఎమ్మార్పీఎస్ అడ్ హాక్ కమిటీ కన్వీనర్ గా కన్నూరి ధర్మేందర్



గోదావరిఖనిటౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) స్థానిక రామగుండంఎమ్మార్పీఎస్ కార్పొరేషన్ హడ్ హక్ కమిటీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రామగుండం కార్పొరేషన్ ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ హడ్ హక్ కమిటీ మంగళవారం రోజున ఎన్నిక జరిగింది. ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ హడ్ హక్ కమిటీ కన్వీనర్ గా కన్నూరి ధర్మేందర్, కో కన్వీనర్ గా చిలుముల గట్టయ్య, ఏలూరి రాంబాబు, అట్లూరి లింగస్వామి మాదిగ ని ఎన్నుకోవడం జరిగింది కన్వీనర్ గా ఇరుగురాల శివకుమార్ మాదిగ కో కన్వీనర్ గా గుండ్ల రాకేష్ మాదిగ కాదాశి శంకర్ మాదిగను ఎన్నుకోవడం జరిగింది. ఈ యొక్క ఎన్నికకు సహకరించిన ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అర్థనేటర్ ఇంజనం వెంకటస్వామి జిల్లా ఇన్చార్జ్ రుద్రారం రామచందర్ రామగుండం కార్పొరేషన్ ఇంచార్జ్ రేణికుంట సాగర్ మాదిగ జిల్లా నాయకులు మంతెన చందు మాదిగ మడిపల్లి దశరథం మాదిగ పల్లె బాపు మాదిగ కాంపెల్లి శ్రీనివాస్ కాజీపేట రాజన్న ఏదినూరి కొమురయ్య కి కృతజ్ఞతలు కన్వీనర్లు తెలపడం జరిగింది.

## బాలానగర్ ఏసీపీ హనుమంత్ రావు ని కలిసి
## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన..
### హెచ్.ఏ.ల్ ఐ.యన్.టి.యు.సి ప్రధానకార్యదర్శి కర్క నాగరాజు




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్) బాలానగర్ ఏసీపీ హనుమంత్ రావు గారికి మరియు సీఐ నర్సింహారాజు గారికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ రోజు వారి కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి పూల బొకేతో నూతన సంవత్సర శు



భాకాంక్షలు తెలిపిన హెచ్.ఏ.ల్ రికగ్ నైస్డ్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐ.యన్.టి.యు.సి ప్రధానకార్యదర్శి కర్క నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ కూతడి కృష్ణా, జాయింట్ సెక్రటరీ డి.వెంకటప తి,వడ్డే నాగార్జున, ఆర్గనైసింగ్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి కెసిఆర్ సారే
### మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజు



మధిర, (శుభోదయం న్యూస్): మధిర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎర్రుపాలెం మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై నాయకులు కార్యకర్తలతో పార్టీ భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రాష్ట్రం అధోగతి పాలలైదని, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ఉట్టి మాటల గారడి తో కాలక్షేపం చేస్తుందని, ప్రజలు గత ప్రభుత్వం ఇప్పటి ప్రభుత్వం పాలన వ్యత్యాసం తెలుసుకొని మళ్లీ కెసిఆర్ సారే రావాలని, కాంగ్రెస్ పార్టీ



పాలన పై అతి తక్కువ కాలంలోనే విసిగి పోయారని, మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, రాష్ట్రం దేశంలోనే అగ్రగామీగా నిలవాలంటే కెసిఆర్ సారే రావాలని ఒక పూర్తి విశ్వాసంతో,ఒక దృఢ సంకల్పంతో ఉన్నారని నాయకులు కార్యకర్తలకు తెలియజేశారు. పార్టీకి ప్రజలే పట్టుకొమ్మలు, ప్రజలు బిఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, ఎర్రుపాలెం మండల బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి యన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎర్రుపాలెం మాజీ జడ్పిటిసి శీలం కవిత, ఎర్రుపాలెం మాజీ మండల పార్టీ అధ్యక్షులు సేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, కుడుముల మల్లికార్జున్రెడ్డి,కత్తుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి,సింహాద్రి తదితర బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

## ఎసిఐసి సిబిఐటి గ్రాస్ రూట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ కోహెూర్ట్ ను ప్రారంభం




హైదరాబాద్, (శుభోదయం న్యూస్): భారత ప్రభుత్వ గ్రాస్రూట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (గ్రిప్) యొక్క రెండవ బృందాన్ని ఏఐఎం నీతి ఆయోగ్ మద్దతుతో అగ్రగామి అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ ఎసిఐసి సిబిఐటి సగర్వంగా ప్రారంభించింది. సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి కమ్యూనిటీ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి అట్టడుగు ఆవిష్కర్తలు, విద్యార్థులు మరియు స్టార్టప్లను శక్తివంతం చేయడం ఈ చొరవ లక్ష్యం.గండిపేటలోని సీబీఐటీ క్యాంపస్ లో గ్రిప్ కోహెూర్ట్-2 ఓరియెంటేషన్ సెషన్ జరిగింది. ఈ కార్యక్రమం పాల్గొనేవారికి సాదర స్వాగతంతో ప్రారంభమైంది, తరువాత ఎసిఐసి సిబిఐటి యొక్క విజన్ మరియు మిషన్ గురించి పరిచయం చేయబడింది. ఇన్నోవేషన్, ఎంటర్ప్రెన్యూర్షిప్కు దోహదపడే మార్కర్స్పేస్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ సహా కేంద్రం అత్యాధునిక సౌకర్యాల గురించి పాల్గొనేవారికి వివరించారు.ప్రోగ్రామ్ అవలోకనం మరియు షెడ్యూల్ ఎసిఐసి సిబిఐటి సిఇఒ డాక్టర్ సన్నీ అగర్వాల్ ఈ సమావేశంలో ప్రసంగించారు, గ్రిప్ 2 కార్యక్రమం యొక్క వివరణాత్మక షెడ్యూల్ ను వివరించారు. ప్రోటోటైప్ డెవలప్ మెంట్ సపోర్ట్ కొరకు మార్కర్ స్పేస్ సెక్టార్ నిర్దిష్ట ల్యాబ్ లకు ప్రాప్యత, డిజైన్ థింకింగ్ %ఎ% ఇన్నోవేషన్ (డిటిఐ) పై వర్క్ షాప్ ల శ్రేణి, ఫండింగ్ మరియు మెంటర్ షిప్ మరియు భాగస్వాములకు వారి ఆలోచనలను సమర్థవంతంగా కమ్యూనికేట్ చేయడానికి పాల్గొనేవారిని సిద్ధం చేయడం వంటి సమగ్ర ఆవిష్కరణ ప్రయాణాన్ని పాల్గొనేవారికి అందించడానికి ఈ కార్యక్రమం రూపొందించబడింది.కిట్ పంపిణీ కార్యక్రమం గ్రిప్-2 అధికారికంగా ప్రారంభమైన సందర్భంగా డాక్టర్ యూకే చౌదరి అడ్వైజర్, సీబీఐటీలోని ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ గ్రిప్ ఫెలోలకు ఇన్నోవేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లు పాల్గొనేవారిని వారి ప్రాజెక్టులకు అవసరమైన సాధనాలతో సన్నద్ధం చేయడానికి రూపొందించబడ్డాయి, ఇది క్షేత్రస్థాయి ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కేంద్రం యొక్క నిబద్ధతను సూచిస్తుంది.పూర్వ విద్యార్థుల అంతర్దృష్టులు గ్రిప్ కోహెూర్ట్ 1 కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్న స్ఫూర్తిదాయక సెషన్ తో కార్యక్రమం ముగిసింది. పూర్వ విద్యార్థులు తమ విజయగాథలు, నేర్చుకున్న పాఠాలు మరియు వారి ఆవిష్కరణ ప్రయాణాలపై కార్యక్రమం యొక్క ప్రభావాన్ని పంచుకున్నారు. వారి అనుభవాలు కొత్త బృందానికి ప్రేరణ వనరుగా పనిచేశాయి, గ్రిప్ చొరవ యొక్క పరివర్తన సామర్థ్యాన్ని హైలైట్ చేశాయి.సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ సంస్కృతిని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఇది స్థిరమైన మరియు స్కేలబుల్ పరిష్కారాలతో నిజ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించగల ఛేంజ్ మేకర్లను శక్తివంతం చేసే ఉద్యమం." శిక్షణ, మార్గదర్శకత్వం, నిధులు మరియు నెట్వర్కింగ్ అవకాశాలను మిళితం చేసే ప్రోగ్రామ్ యొక్క సమగ్ర విధానం ఆలోచనలు మరియు ప్రభావవంతమైన పరిష్కారాల మధ్య అంతరాన్ని పూడ్చడం లక్ష్యంగా పెట్టుకుంది.

## ప్రజా పాలనలో భాగంగా
## ప్రజల సమస్యల పరిష్కారం చూస్తున్నాం
### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) గోదావరిఖని లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా పాలన లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సమన్యాయం చేయాలనే ఉద్దేశ్యం తో ఏర్పడిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దానికి అనుగుణంగా రామగుండం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఈ రోజు ప్రజలు అనేక సమస్యలను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి దృష్టికి తీసుకొని రాగ వెంటనే వారిసమస్యలను, వారు ఎదుర్కొంటున్నా అనేక ఇబ్బందులను సావధానంగా విని వారి సమస్యలను పరిష్కరించి ప్రజా పాలన అంటే ఏవిధంగా ఉంటుంది అని నిరూపించారు.ఈ



సందర్భంగా వారు ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ఇంకా మీకు గాని మీ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న క్యాంపు కార్యాలయం కు నేరుగా వచ్చి మీ సమస్యలు ఈ విధంగాపరిష్కరించుకోవాలని సూచించారు.మీ వ్యక్తిగత సమస్యలే కాకుండా మీ ప్రాంత అభివృద్ధి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేస్తే బాగుంటుంది, మీ ప్రాంత అభివృద్ధి కోసం మీరు పని చేయాలని వారికి సూచించారు.

## చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో టిసిసి ఉచిత డెమో క్లాస్



మంచిర్యాల జిల్లా (శుభోదయం న్యూస్ ):మంచిర్యాల జిల్లా కేంద్రంగా ప్రముఖ చిత్రకారుడు మరియు ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్ బిఎఫ్ఏ నెలకొల్పిన చిత్రకళా శిక్షణ సంస్థ చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుండి జరుగనున్న టీసిసి (డ్రాయింగ్ లోయర్ హయ్యర్, టైలరింగ్ మరియు ఎంబ్రాయిడరీ) పరీక్షలు రాయబోయే అభ్యర్థుల కోసం ఈనెల 8వ తేదీన మంచిర్యాల బస్ స్టాండ్ సమీపంలో గల వివేకవర్థిని డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత డెమో క్లాస్ నిర్వహిస్తున్నట్టుగా సంస్థ డైరెక్టర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు... అనుభవజ్ఞుల సహకారంతో పరీక్షలలో ఉపయోగించే మెళకువలు, సలహాలు, సూచనలు అందించనున్నట్లుగా ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని ఉత్తీర్ణులు కావాలని కోరారు... ఇతర వివరాలకు 9908149591 లో సంప్రదించవచ్చని తెలిపారు...

## వాహన తనిఖీల్లో పట్టుబడ్డ గంజాయి




వలిగొండ మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ టి జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా,చిట్యాల వైపు నుండి వలిగొండ వైపుగా ఒక హెూండా షైన్ బైక్ మీద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వస్తుండగా,వారిని పట్టుబడి చేసి తనిఖీ చేయగా వారి వద్ద 3,760 గ్రాముల గంజాయి దొరికింది, పట్టుబడిన వారు కుంచం విజయ్ కుమార్,తండ్రి శ్రీను,వయస్సు 20 సంవత్సరాలు, కులం వడ్డెర, ఓ సి సి డిగ్రీ విద్యార్థి,ఎస్సీ కాలనీ,తుమ్మలగూడెం గ్రామం రామన్నపేట మండలం,సిరిగిరి బోయజ్,తండ్రి కిష్టయ్య,వయస్సు 20 సంవత్సరాలు,కులం బుడిగ జంగాలు, ఓ సి సి స్క్రాప్ వ్యాపారం, జంగాలకాలనీ,వలిగొండ మండల కేంద్రానికి చెందిన వారిపై పలు సెక్షన్ల కింద రామన్నపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి, సీఐ రామన్నపేట ఉత్తర్వుల మేరకు కేసు దర్యాప్తును చేపట్టి ఇద్దరు వ్యక్తులను రిమాండ్ కు తరలించడం జరిగింది. మంగళవారం తేదీ 07-01-2025 న తప్పించుకు పారిపోయిన దుర్గా ప్రసాద్,నివాసం టేకులసోమారం గ్రామం,వలిగొండ మండలనికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమండ్ కు తరలించడం జరిగిందని స్థానిక ఎస్సై యుగెందర్ గౌడ్ తెలిపారు.

## రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు పలు డివిజన్ లో పర్యటించిన మక్కాన్ సింగ్ సేవాసమితి చైర్మన్ మనాలి ఠాకూర్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మంగళవారం రోజున పలు డివిజన్ లో పర్యటిస్తూ డివిజన్లోని సమస్యలు అడిగి తెలుసుకొని వెంటనే శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి సతీమణి మనాలి ఠాకూర్.

## రైతు సంక్షేమాన్ని చూసి ఓర్వ లేకనే ధర్నాలు
## పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ ధర్నాలు. ఆందోళనలు చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్. కే. గార్డెన్స్ లో మంగళవారం రోజున ఎమ్మెల్యే విజయరమణా రావు పత్రికా మరియు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కూడా లేకుండా పోతుందనే భయంతో బిఆర్ఎస్ లీడర్లు రోడ్లపైకి వచ్చి రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రైతులకు ఎందుకు రుణమాఫీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. కటింగ్ లేకుండా వడ్లు కొనుగోలు ఎందుకు చేయలేదని నిలదీశారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో రూ.239 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని చెప్పారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానీ కొందరికి త్వరలోనే మాఫీ చేయడం జరుగుతుందని వివరించారు. సన్న వడ్లకు రూ.59.20కోట్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కొద్ది రోజుల్లోనే రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామని తెలిపారు. రైతులకు ఇలా అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే సంక్షేమ పథకాలు చేపడుతుంటే 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ రైతులకు ఏం చేసిందని ఆయన నిలదీశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ చేస్తున్న ధర్నాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఈ - రేస్ ఫార్ములా కేసులో కేటీఆర్ ప్రజలకు చెప్పేదొకటి చేతల్లో చేసేది మరొకటి గా ఉందన్నారు. ఒకవైపు విచారణ కు హాజరవుతా అవసరమైతే జైలుకు వెళ్తా అని ప్రగల్బాలు పలికిన కేటీఆర్ తిరిగి అరెస్టు భయంతో హైకోర్టులో క్వాట్ పిటీషన్ వేశారని అన్నారు. హైకోర్టు తాజాగా ఆయన పిటిషన్ కొట్టి వేసిందన్నారు. ఈ కేసులో తన నిజాయితీని నిరూపించుకోవాలంటే ఏసీబీ విచారణకు హాజరు కావాలని విజయరమణ రావు సూచించారు. చట్టం ఎవరికి చుట్టం కాదని. చట్టం తన పని తను చేసుకోపోతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప. మినుపాల ప్రకాష్ రావు. పట్టణ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య. భుతగడ్డ సంపత్. బండారి రామ్మూర్తి. సందనవేమీ రాజేందర్. తూముల సుభాష్, అశ్రాఫ్. సయ్యద మస్రఫ్. బొడ్డుపల్లి శ్రీనివాస్, కుమార్, గాజుల రాజమల్లు, సామ రాజేశ్వర్ రెడ్డి, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి. శ్రీగిరి శ్రీనివాస్. అల్ల సుమన్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు. సర్వర్. మాజీ సర్పంచులు. ఎంపీటీసీలు. మార్కెట్ డైరెక్టర్లు. పలువురు కాంగ్రెస్ నాయకులు. కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ కాంగ్రెస్ సర్కార్ లో గ్రామాలకు మహర్దశ

### పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కనుకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రామునిపల్లి. కనుకులలో రూర్బన్ పథకం కింద నిర్మించిన గోదాములను. సొసైటీ కార్యాలయం విస్తరణ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామం నుండి తొగర్రాయి గ్రామం వరకు ఉన్న రోడ్డును త్వరలోనే డబుల్ రోడ్డుగా విస్తరించినట్టు చెప్పారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామం నుండి కనుకుల. ఓదెల మండలం ఉప్పరపల్లి మీదుగా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి వరకు ఉన్న అనేక గ్రామాలను కలిపే రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో తొలి దశలోనే ఇట్టి పనులను సుల్తానాబాద్ మండలంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ధాన్యం కొనుగోలు సెంటర్లను కేటాయించి ఆయా సంఘాలను ఆర్థికంగా బోలోపేతానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన. ఇందులో భాగంగా రూ. 2 లక్షల రుణమాఫీ. సన్న వడ్లకు బోనస్. కటింగులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టామని. త్వరలోనే రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల పథకానికి శ్రీకారం చుట్టనున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు కోట వీణ. ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు. సీఈవో బొంగోని శంకర్. డిసి ఓ. సహకార సంఘం పాలకవర్గం. కేడీసీసీబీ డైరెక్టర్. సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్. సుద్దాల సింగిల్ విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి. చిలుక సతీష్. గాజుల రాజమల్లు. కాంగ్రెస్ నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని నిరసిస్తూ మంగళవారం నాడు గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంవత్సరానికి రైతు భరోసా రైతులకు 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఇప్పుడు 12 వేల రూపాయలు ఇస్తామని అనడం సిగ్గుచేటు అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయంలో రైతులకు సంవత్సరానికి రైతు భరోసా పదివేల రూపాయలు ఇచ్చారు. అంతేకాకుండా రైతు బీమా రైతుబంధు కెసిఆర్ కిట్టు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ దళిత బంధు పథకాలను రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు రైతులకు రైతు భరోసా 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రైతులను మోసం చేయడానికి రైతు భరోసా12 వేల




రూపాయలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 13 నెలల అవుతున్న ఏ ఒక్కరికి కళ్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. కెసిఆర్ ఇచ్చిన కళ్యాణ లక్ష్మి లక్ష ఒక వెయ్యి 16 రూపాయలు ఇస్తున్నారు అని అన్నారు ఇప్పటికిప్పుడు ఎలక్షన్లు పెడితే కెసిఆర్ ప్రభుత్వం 100 సీట్లతో అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ చెప్పిన కల్లబొల్లి మాటలు నమ్మొద్దని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రైతు పక్షాన పార్టీ అని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ రైతులకు రైతు భరోసా 15వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు లేకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు మంద భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ బాధితుడికి ఆర్థిక సహాయం సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల (శుభోదయం న్యూస్ ):గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన మోతే నరసింహులు ఇటీవలే గత కొన్ని రోజుల క్రితం ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మంగళవారం ట్రస్ట్ సభ్యులతో కలిసి బాధితుడుని పరామర్శించారు. అనంతరం అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ.. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. .ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మొగులయ్య, సత్యనారాయణ, వెంకట్, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, ఉషన్న రాజు, ఆంజనేయులు యాదవ్, మచ్చేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, బాలరాజ్ యాదవ్, బీరప్ప యాదవ్, శ్రీకాంత్ రెడ్డి స్థానిక నాయకులు ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల కల నెరవేరేనా



వలిగొండ మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్)తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారుల కలనెరవేరేన అని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి సంఘీశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ఎందుకు ఆలస్యం జరుగుతుందోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీ 25 వేల రూపాయల పెన్షన్ 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి హామీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీ పై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన అన్నారు, త్యాగాలు ఉద్యమకారులు లేనిదే రాష్ట్రం రాలేదు అనేది గుర్తించుకోవాలని అలాంటి త్యాగాలు చేసిన వారిని నిర్లక్ష్యం చేయడం తగదని ఆయన అన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ గా గడ్డం తిరుపతి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా మడ్డి తిరుపతి



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) : మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమతులైన సందర్భంగా పెద్దపల్లి నుండి గోదావరిఖని చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించి రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ గారికి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ గడ్డం తిరుపతి మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతి పది మంది డైరెక్టర్లతో కలిసి గజమాలతో శాలువాతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.



అనంతరం ఎమ్మెల్యేమాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ భూములన్నిటికీ ఎకరాకు 12000 చొప్పున రైతు భరోసా పథకం, అలాగే వ్యవసాయ భూములు లేని రైతులకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున ఇంద్రమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కింద సహాయం చేయాలని ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించిన మన అందరి ప్రియతమా ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గారు మరియు మంత్రివర్యులు శ్రీధర్ బాబు గారు, ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క గారు వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు



గారికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను గుర్తించి నందుకు ధన్యవాదాలు తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ ఈరోజు ప్రజలకుచేస్తున్నటువంటి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు అదే మాదిరిగా రైతు రుణమాఫీ భారీ ఎత్తున బాధ్యతలు తీసుకున్న కార్యక్రమం కూడా ఉందని ఈరోజు ఘనంగా ఉత్సాహంగా అన్ని గ్రామాల నుండి కార్యకర్తలు భారీగా ర్యాలీలో పాల్గొనడం జరిగింది.

## మైనర్లతో పనులు చేయిస్తే చర్యలు...

పాపన్నపేట, మండల రిపోర్టర్-రవి,(శుభోదయం న్యూస్): బడీడు పిల్లలు, మైనర్లను పనుల్లో చేర్చుకుంటే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆపరేషన్ స్మైల్ లో భాగంగా మండలంలో ఆపరేషన్ స్మైల్ జిల్లా సభ్యులు మంగళవారం వ్యాపార సంస్థలు, దుకాణాలు హొటళ్ళు, ఇటుక బట్టీల వద్ద తనిఖీలు నిర్వహించారు.నార్సింగిలో ఓ ఇటుక బట్టీ వద్ద ఓ బాలుడు పని చేస్తుండడాన్ని గుర్తించారు.సంబంధిత ఇటుక బట్టీ నిర్వాహకుడు, కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.మండలంలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.మైనర్లతో పనులు చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## 24 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్): మంథని పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటి. పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఐటి. పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు మంథని లో పలు అభివృద్ధి పనులకు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ. తో కలిసి మంథని పట్టణంలో పర్యటించి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 24 కోట్ల 5 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ. పట్టణంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 30 కోట్లతో రోడ్లు. డ్రైయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. నేడు పురపాలక కార్యాలయం, డంపింగ్ యార్డ్ నందు సేగ్రిగేషన్ షెడ్. కంపోస్ట్ షెడ్. ఆఫీసు రూమ్ సెక్యూరిటీ రూమ్.టాయిలెట్స్. వేయింగ్ బ్రిడ్జ్ పెద్దపల్లి. గోదావరిఖని. కాటారం నుండి మంథని పట్టణానికి వచ్చే రొడ్డు ప్రారంభంలో ఆర్చిలను 9 కోట్ల 20 లక్షలతో చేపట్టామని అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో శ్రీరామ్ నగర్ నుంచి మాత శిశువు హాస్పిటల్. పోచమ్మ వాడ నుంచి గోదావరిఖని క్రాస్ రోడ్. లైన్ గడ్డ. గంగాపురి క్రాస్ రోడ్. గిట్ల రమణారెడ్డి విగ్రహం. కూచి రాజు పల్లి క్రాస్ రోడ్ వద్ద 6 కోట్ల 71 లక్షలతో సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. పట్టణంలో సమీకృత వెజ్. నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణం. వివిధ వార్డులలో సిసి రోడ్లు. సైడ్ డ్రైయిన్ నిర్మాణ పనులను 8 కోట్ల 14 లక్షలతో మంజూరు చేసి పనులు ప్రారంభించామని అన్నారు. మొత్తం పట్టణంలో 24 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు.6 నెలల కాలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలని మంత్రి అధికారులకు సూచించారు. గత 10 సంవత్సరాలలో మంథని ప్రాంతం ఆశించిన అభివృద్ధి జరగలేదని. ముఖ్యమంత్రి సహచర మంత్రుల సహకారంతో మంథని నుంచి మంచిర్యాలను కనెక్ట్ చేస్తూ 140 కోట్లతో గోదావరి నదిపై బ్రిడ్జి మంజూరు చేసుకున్నామని. అదే విధంగా మంథని పట్టణానికి రింగ్ రొడ్డు నిర్మాణం వల్ల పట్టణ విస్తరణ పెరుగుతుందని మంత్రి తెలిపారు.మంథని పట్టణ విస్తరణ జరుగడం వల్ల దేశ విదేశాలలో ఇతర ప్రాంతాలలో స్థిర పడిన ప్రజలు సొంత గ్రామాలలో ఇండ్లు నిర్మించుకునేందుకు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంటుందని. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని. రోడ్ల అభివృద్ధి ద్వారా వాణిజ్య సదుపాయాలు మెరుగవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సంతోషంగా ఉన్నారని. రుణమాఫీ. సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్ అందించడంతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా క్రింద అందించే పెట్టుబడి సహాయాన్ని 12 వేలకు పెంచుతున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తున్నామని అన్నారు.ప్రతి గ్రామ పంచాయతీలో రైతు రుణమాఫీ. సన్న వడ్లకు బోనస్. పెట్టుబడి సహాయం. రెతులు వివరాలు ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా కేబుల్ ఛానల్ లో సామాజిక మీడియా ద్వారా ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం మంత్రి ఆలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్. తహసీల్దార్ రాజయ్య. ఈఈ సంపత్. ఏ. ఈ. మౌనిక. సంబంధిత అధికారులు. ప్రజా ప్రతినిధులు. తదితరులు పాల్గొన్నారు.

## లూయి బ్రెయిలీ 216జన్మదిన వేడుకలు.

నారాయణపేట జిల్లా ప్రతినిధి,(భారత్ రిపోర్టర్):మహిళ, శిశు, వికలాంగుల వయోవృద్ధులసం క్షేమ శాఖ ఆ ధ్వర్యంలోలూయి బ్రెయిలీ 216 జయంతి వేడుక లను జిల్లా సంక్షేమ శాఖకార్యా లయములో నిర్వహించడం జ రిగింది ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పాల్గొని లూ యీ బ్రెయిలీ216 జన్మదినోత్స వ వేడుకలను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బ్రెయి లీని స్మరించుకుంటూ ఆయన అందులకు అందించిన సేవను కొనియాడడం జరిగింది. ము ఖ్యంగా అందుల కొరకు లిపిని కనుగొని అందులకు ఆదర్శం గా నిలవడం జరిగింది కావున ఆయన ఘనతను గుర్తించడా నికి మంగళవారం బ్రెయిలీ 21 6 పు ట్టిన రోజు సందర్భం గా అంధులంతా కలిసి ఈ కార్య క్రమంలో పాల్గొనడం జరిగింది ప్రతి ఒక్కరూ బ్రెయిలీని స్మరిం చుకుంటూ ఆయన గొప్పతనాన్ని తెలపడం జరిగింది.ము ఖ్యంగా బ్రెయిలీఅందించిన లి పి ద్వారా ఎంతో మంది అందు లో ఆదర్శవంతులుగా తీర్చిది ద్దబడ్డారు అనగా ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులలో స్థిరపడ డం జరిగింది అలాగే జిల్లాసంక్షే మ కార్యాలయ సిబ్బందితో పా టు అంధులంతా కలిసి ఆయ న పుట్టినరోజు సందర్భంగా కే కు కట్ చేయడం జరిగింది. అ దే విధంగా కొత్తగాఉద్యోగాలు సాధించిన అందులకు శాలు వాతో సన్మానించడంజరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షే మ అధికారిని ఎం.జయ, క్షేత్ర స్థాయి అధికారి యు. సాయి జిల్లాలోని అందులు,జిల్లా సం క్షేమ కార్యాలయ సిబ్బంది, త దితరులు పాల్గొన్నారు.

## మక్తల్ వ్యవసాయ మార్కెట్ కమిటీపాలకవర్గం చైర్మన్ గవినోళ్ల రాధా లక్ష్మారెడ్డి ని వైస్ చైర్మన్ గణేష్ కుమార్ సన్మానించిన సిద్ధి లింగేశ్వర మహాస్వామి

మక్తల్ నియోజకవర్గంప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ మరియు డైరెక్టర్స్ ని ఘనంగా సన్మానించిన నేరడుగోమ్ పీఠాధిపతి సిద్ధి లింగేశ్వర మహాస్వామి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఫౌండేషన్ చైర్మన్ జి బాలకృష్ణ రెడ్డి మక్తల్ వ్యవసాయ మార్కెట్ మంచిగా తీర్చిదిద్దాలని వాకిటి శ్రీహరి సూచనల సలహాలు తీసుకొని మక్తల్ వ్యవసాయ మార్కెట్ పూర్వ వైభవం తీసుకరావాలని మరియు కర్ణాటక ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని తీసుక వెళ్లకుండా మక్తల్ మార్కెట్ లోనే ధాన్యాన్ని పూర్తి స్థాయిలో క్రయ విక్రయాలు జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని గవినోళ్ల బాలకృష్ణ రెడ్డి సూచించారు ఇట్టి కార్యక్రమంలో ఛైర్మెన్ రాధాలక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మెన్ రవికుమార్ యాదవ్,వైస్ ఛైర్మెన్ గణేష్ , డైరెక్టర్స్ శ్రీనివాస్ రంజిత్ రెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి శాలంఫయాజ్ , బాలప్ప,నాగరాజుమహేష్ ,జనార్ధన్ గుప్తా నాగప్ప ,లికటం సుధీర్ ,విజయ్ మొదలగు వారు పాల్గొన్నారు

## జిల్లా ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్ ను తయారు చేయండి.

### -జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.

నారాయణపేట జిల్లా ప్రతినిధి,:డిస్టిక్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్ ను తయా రు చేయాలని జిల్లా కలెక్టర్ సి క్తా పట్నాయక్ సంబంధితఅధి కారులకు సూచించారు.మంగ ళ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో డిస్ట్రిక్ట్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్ పై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ డైరెక్టర్ జనర ల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీ కెవిఎస్ శైలజ, లాజిస్టిక్ ఇండస్ట్రీస్ కామర్స్ రీజినల్ డైరెక్టర్ అపర్ణ,డిప్యూ టీ డైరెక్టర్ సుదీప్ పాల్, ఫెడరే షన్ ఆఫ్ ఇండియా ఎక్స్ పోర్ట్ ఆర్గనైజర్ కులకర్ణి, నాబార్డ్ అ ధికారి షణ్ముఖ చారి తో వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా.సమీక్ష నిర్వహించారు.నారాయణ పేట జిల్లా నుంచి విదేశాలకు ఎక్స్ పోర్ట్ చేసే వివిధ ఉత్ప త్తుల గురించి చర్చించారు. జిల్లాలోప్రధానంగా వరిధాన్యం పత్తి, హ్యాండ్లూమ్ (కాటన్ సి ల్క్, జరీ) ఎక్స్ పోర్ట్ చేసేందు కు నిర్ణయించారు. అందు కు సంబంధించిన ప్రణాళికను సి ద్ధం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాకు చెందిన సం బంధిత అధికారులకు సూచిం చారు. సమావేశంలో జిల్లా వ్య వసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ...జిల్లా లో వంద ఎకరాలలో మునగ ఆకు సాగు చేస్తున్నారని, దాని పొడిని ఎక్స్ పోర్ట్ చేసే అవకా శం ఉంటే పరిశీలించాలని కో రారు.ఒక్కో జిల్లా నుంచి ఒక్కో ఉత్పత్తిని ఎక్స్ పోర్ట్ చేసే అవ కాశం ఉందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మహేశ్వర్ తెలి పారు.జిల్లాలో శీతాఫలాల ప్రా సెసింగ్ కూడా జరుగుతుందని ఆ విషయాన్ని పరిగణనలో కి తీసుకోవాల నీ నాబార్డు అధికారి షణ్ముఖచారి వీసీ ద్వారా కలెక్టర్ ను కోరారు.డిస్టిక్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్ కమిటీ జి ల్లాలోని ప్రధాన ఉత్పత్తుల గు రించి పరిశీలించి వెనుకబడిన ఈ జిల్లాను ఆర్థికంగా అభివృ ద్ధి చేసే విధంగా ముందుకు తీ సుకువెల్లెందుకు కృషి చేయా లని కలెక్టర్ కోరారు. వీసీ లో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్,పీ. ఐ. ఓ నర్సింగ్ రావు, జిల్లా వ్యవసా య శాఖ అధికారి జాన్ సుధా కర్,చేనేత జౌళి శాఖ అధికారి బాబు, జిల్లా రైస్ మిల్లర్ అసో సియేషన్ అధ్యక్షులు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెంట్లవెల్లి కొల్లాపూర్ కస్తూరిబా పాఠశాల సందర్శన

చిన్నంబావి మండలం (:కొల్లాపూర్ మరియు పెంట్లవెల్లి మండల కేంద్రంలోని బాలికల కస్తూరిబా పాఠశాలలను నేడు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఆధ్వర్యంలో సందర్శించి పాఠశాలలో వివిధ సమస్యలను ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో మాట్లాడి ఆరాతీశారు.ముందుగా పెంట్లవెల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు ఏర్పాటుచేసిన భోజన సదుపాయాలను పరిశీలించారు.పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో రోటరీ క్లబ్ వాళ్ళు ముందుకొస్తున్నారని వాటితోపాటు ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్. పెంటలవెల్లి పాఠశాల ఎస్ ఓ లు నరాయనమ్మ.సువర్ణ ఆయా పాటశాలల ఉపాధ్యాయురాలు. రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

శుభోదయం
బుధవారం -08-జనవరి-2025

# ఏపీ ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్.. వారికి టికెట్‌లో 10శాతం రాయితీ

### సంక్రాంతి పండుగ సందర్భంగా

**ఏపీలో సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది.**



అమరావతి : సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపీలో సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆర్టీసీ బస్సులో ఒకేసారి రెండువైపులా టికెట్ బుక్ చేసుకునే వారికి 10 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే ఉంటాయని స్పష్టం చేసింది.సంక్రాంతి పండుగ దృష్ట్యా 7,200 అదనపు బస్సులను తెలంగాణ , ఇతర రాష్ట్రాలకు నడపాలని సంస్థ నిర్ణయించిందని ఆర్టీసీ ఎండీ మంగళవారం వెల్లడించారు. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు అదనపు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి పలుచోట్లకు 2,153, బెంగళూరు నుంచి పలు చోట్లకు 375 బస్సులు, విజయవాడ నుంచి 300 బస్సులను నడుపనున్నామని వివరించారు.తిరుగు ప్రయాణాలకు ఈనెల 16 నుంచి 20 వరకు 3200 ప్రత్యేక బస్సులు అన్ని ప్రాంతాలకు నడుపుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నామని ఎండీ తెలిపారు.

# తెలంగాణలో కొనసాగుతోన్న చలి.. రాబోయే ఐదు రోజులు జర జాగ్రత్త..!



తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తరాది జిల్లాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. చలి కూడా తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తరాది జిల్లాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. చలి కూడా తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. ఉదయం 10 అయినా కూడా చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది.జనవరి 8 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన చలి గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ-హైదరాబాద్) అంచనా వేస్తోంది. అప్పటి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండవచ్చని, కానీ ఆ తర్వాత కనిష్ట ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవచ్చని ఐఎండీ తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల వరకు తగ్గుతాయని, హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో 7-9 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. రాబోయే 5 రోజులు పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయని ఐఎండీ పేర్కొంది. ప్రజలు జాగ్రత్తలు పాటించి, చలి తీవ్రత నుంచి రక్షణ పొందాలని సూచించారు.ఈ ఉష్ణోగ్రతలు సంక్రాంతి పండుగ వరకు కొనసాగే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు వెచ్చని ప్రదేశాల్లో ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో 11.6 డిగ్రీల సెల్సియస్ నుంచి 15 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హెచ్‌సీయూ క్యాంపస్‌లో 11.6 డిగ్రీల సెల్సియస్, మౌలాలీలో 11.8, రాజేంద్రనగర్‌లో 12.2, ఆర్సీ పురంలో 12.2, అల్వాల్‌లో 13.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే.. కోహిర్(సంగారెడ్డి)లో 9 డిగ్రీలు, తిర్యానీ(ఆసిఫాబాద్) 9.6, సిర్పూర్(ఆసిఫాబాద్) లో 9.7, మొయినాబాద్(రంగారెడ్డి)లో 10.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

# బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే

## గాంధీ భవన్ పునాదులు కూడా మిగలవు : బండి సంజయ్

**బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీ భవన్ పునాదులు కూడా మిగలవు : బండి సంజయ్**



హైదరాబాద్ : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మంది కార్యకర్తలొచ్చి దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు.%రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? పిల్లలు, వృద్ధులకు రాళ్ల తగిలితే పరిస్థితి ఏ విధంగా ఉండేదో తెలియదా? అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్ద న్నారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే దాడికి పాల్పడ్డ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.కాగా, ఎంపీ ప్రియాంక గాంధీపై( బీజేపీ నేత రమేష్ బిధూరీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీస్‌పై) కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. బీజేపీ ఆఫీస్‌పై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలపై బీజేపీ నాయకులు ఎదురుతిరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరు వర్గాల కార్యకర్తలు కర్రలతో కొట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు.

# నష్టాలకు బ్రేక్.. స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఎంహెచ్‌పీవీ వైరస్ నేపథ్యంలో నిన్న భారీ నష్టపోయిన సూచీలు మంగళవారం కోలుకున్నాయి. వైరస్‌తో ఎలాంటి ఆందోళనలు పడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచించిన వేళ.. మార్కెట్లు కాస్త కోలుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఎంహెచ్‌పీవీ వైరస్ నేపథ్యంలో నిన్న భారీ నష్టపోయిన సూచీలు మంగళవారం కోలుకున్నాయి. వైరస్‌తో ఎలాంటి ఆందోళనలు పడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచించిన వేళ.. మార్కెట్లు కాస్త కోలుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే.. సెన్సెక్స్ 78,019.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభంలోనే 422 పాయింట్లకుపైగా పెరిగింది. ఆ తర్వాత చివరి వరకు మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో 77,925.09 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 78,452.74 పాయింట్ల గరిష్ఠానికి చేరుకుంది. చివరకు 234.12 పాయింట్ల లాభంతో 78,199.11 వద్ద స్థిరపడింది.నిఫ్టీ 91.85 పెరిగి.. 23,707.90 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,527 షేర్లు పెరగ్గా.. మరో 1,286 షేర్లు తగ్గుముఖం పట్టాయి. నిఫ్టీలో ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్, ట్రెంట్ నష్టపోయాయి. సెక్టార్లలో ఐటి మినహా, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, ఎనర్జీ, బ్యాంక్, మెటల్, ఫార్మా సూచీలు 0.5 నుంచి ఒకశాతం వరకు లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం, బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం వరకు పెరిగాయి.

# ట్రూడో రాజీనామా.. ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటనపై అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు.**



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటనపై అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. కెనడాను 51వ రాష్ట్రంగా చేయాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటం కెనడాలో చాలా మంది ప్రజలకు ఇష్టమేనని వ్యాఖ్యానించారు. కెనడాకు అధికంగా రాయితీలు ఇచ్చి తమ దేశం ఎక్కువ కాలం నష్టపోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయం కెనడా ప్రధాని ట్రూడోకు తెలుసు కాబట్టే రాజీనామా చేశారని వ్యాఖ్యానించారు. అమెరికాలో విలీనమైతే దిగుమతి సుంకాలు ఉండవని, పన్నులు తగ్గుతాయన్నారు. అంతేకాకుండా రష్యా, చైనాలకు చెందిన నౌకల నుంచి ఎలాంటి ముప్పు ఉండదని ట్రంప్ పేర్కొన్నారు.కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ట్రంప్.. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే కెనడా, మెక్సికో, చైనా వస్తువులపై భారీ సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలోకి అక్రమ వలసలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ నివారణకు ఇవి సహాయపడతాయని ఆయన చెప్పారు. మెక్సికో, కెనడాల నుంచి వచ్చే ప్రతి వస్తువుపై 25 శాతం సుంకం విధించే ఉత్తర్వులపై జనవరి 20 సంతకం చేస్తానని ట్రంప్ చెప్పారు. ఫెంటానిల్ స్మగ్లింగ్‌ను చైనా అరికట్టే వరకు ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై అదనంగా 10 శాతం సుంకం విధించాలనుకుంటున్నట్లు తెలిపారు.ఈ ప్రకటన తర్వాత ట్రంప్‌తో కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రూడోకు ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాలను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేదంటే సుంకాలు పెంచుతామని హెచ్చరించారు. ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని సూచించారు. ఈ క్రమంలో 'గవర్నర్ ఆఫ్ కెనడా' అంటూ ట్రూడోపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

### ట్రూడో రాజీనామా..

ఇదిలా ఉండగా.. కెనడా రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. కెనడా ప్రధానమంత్రి పదవికి, అధికార లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా అధినేత పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఒట్టావాలోని తన నివాసం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. కొత్త ప్రధాని ఎన్నిక వరకు తాను ఈ పదవుల్లో కొనసాగుతానని వెల్లడించారు.ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల వరకు పార్టీని, కెనడాకు నాయకత్వం వహించే కొత్త నేత ఎన్నిక ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుగా జనవరి 27న ప్రారంభం కావాల్సిన పార్లమెంటును మార్చి 24 వరకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. 'నేను ఏ పోరాటం నుంచి అంత సులువుగా వెనక్కు తగ్గను. కానీ, కెనడియన్ల ప్రయోజనాలు, నేను ప్రేమించే ప్రజాస్వామ్య శ్రేయస్సు కోసం రాజీనామా చేస్తున్నాను' అని ట్రూడో వ్యాఖ్యానించారు. కెనడాలో అధికార పార్టీ అధినేత రాజీనామా తర్వాత కొత్త నాయకుడి ఎన్నికకు 90 రోజుల గడువు ఉంటుంది. ఈ నేపథ్యంలో తొమ్మిదేండ్ల జస్టిన్ ట్రూడో పాలనకు మరో 90 రోజుల్లోపే తెరపడనుంది.

# సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడ మీదుగా

## ప్రత్యేక రైళ్లు సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా

**విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వివరించారు.**



అమరావతి : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. రైలు నంబరు 07615 ప్రత్యేక రైలు ఈ నెల 11,15 తేదీల్లో కాచీగూడ లో సాయంత్రం 5.45 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుందని వివరించారు.తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07616 ఈ నెల 12,16 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో మధ్యాహ్నం 2.45 కు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 7.35 కి కాచీగూడ చేరుతుందని వెల్లడించారు. ఈ రైలు మల్కాజిగిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి , దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందురు స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు.రైలు నంబరు 07617 ప్రత్యేక రైలు ఈనెల 8న రాత్రి 7.20కు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07618 ఈ నెల 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి చర్లపల్లి చేరుతుందన్నారు.

# వందకు చేరువలో భూకంపం మృతుల సంఖ్య.. 130 మందికి గాయాలు



టిబెట్‌ను భారీ భూకంపం వణికించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ భూకంపంలో మృతి చెందిన వారి సంఖ్య వందకు చేరువైంది. టిబెట్‌ను భారీ భూకంపం వణికించిన విషయం తెలిసిందే. నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో ఇవాళ ఉదయం 6:30 గంటల సమయంలో 7.1 తీవ్రతతో భారీ భూకంపం వచ్చింది. ఆ తర్వాత స్వల్ప తీవ్రతతో పలుమార్లు భూమి కంపించింది. ఈ భూకంపం ధాటికి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. తాజాగా ఈ భూకంపంలో మృతి చెందిన వారి సంఖ్య వందకు చేరువైంది.ఇవాళ ఉదయం కేవలం గంట వ్యవధిలోనే టిబెట్ ప్రాంతంలో ఆరుసార్లు భూమి కంపించింది. ఈ భూకంపం ధాటికి అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదిక ప్రకారం.. పెను భూకంపం ధాటికి ఇప్పటి వరకూ 95 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 130 మంది గాయపడ్డారు.నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో మంగళవారం ఉదయం 7.1 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. చైనాకు చెందిన మానిటరింగ్ ఏజెన్సీ మాత్రం భూకంప తీవ్రతను 6.8గా పేర్కొన్నది. టిబెల్ రాజధాని లాసాకు సుమారు 380 కిలోమీటర్ల దూరంలో భూమి కంపించినట్లు తెలుస్తోంది. టిబెట్‌లో రెండో అతిపెద్ద నగరమైన షిజాంగ్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. అనంతరం షిజాంగ్ ప్రాంతంలోనే మరో రెండుసార్లు భూమి కంపించిందని, వాటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.7, 4.9గా నమోదయిందని వెల్లడించింది.భూకంప తీవ్రత ఉత్తర భారతాన్ని కూడా తాకింది. ఢిల్లీ ఎన్సీఆర్, బెంగాల్, బీహార్, అస్సాం, పశ్చిమబెంగాల్‌తోపాటు పలు ప్రాంతాల్లోనూ ప్రకంపణలు సంభవించాయి. బీహార్‌లో ఆందోళనకు గురైన ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చారు. ఇక చైనా, భూటాన్, బంగ్లాదేశ్‌లోనూ భూమి కంపించింది. భారీ భూకంపం ధాటికి పలుచోట్ల ఎత్తైన భవనాలు నేలకూలాయి. రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికితీస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా పేర్కొంటోంది.

# నగరంలో ఆ నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు.. అత్యల్పం ఎక్కడంటే?



హైదరాబాద్ జిల్లాలో జూబ్లీహిల్స్( నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా జాబితాలో 3,89,954 మంది ఓటర్లతో జూబ్లీహిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. జూబ్లీహిల్స్,జనవరి7 : హైదరాబాద్ జిల్లాలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా జాబితాలో 3,89,954 మంది ఓటర్లతో జూబ్లీహిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఇందులో 2,03,137 మంది పురుషులు, 1,86,793 మంది మహిళలు, 24 మంది థర్డ్ జెండర్ ఓటర్లు నమోదయ్యారు. జూబ్లీహిల్స్ తరువాత రెండు స్థానాల్లో యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవ ర్గంలో 3,66,130 మంది, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో 3,65,183 మంది ఓటర్లు నమోదయ్యారు.గతంలో కూడా ఓటర్ల సంఖ్యలో జిల్లాలో టాపర్‌గా ఉన్న జూబ్లీహిల్స్ 2025 లో తన స్థానాన్ని పదిలపరుచు కుంది. జిల్లాలో చార్మినార్ నియోజకవర్గంలో అత్యల్పంగా 2,32,515 మంది ఓటర్లు నమోదయ్యారు. కాగా ,ఎన్నికల సంఘం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెల 1 వ తేదీతో 18 ఏండ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రతి ఏడాది నాలుగు సార్లు ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో స్థానిక ఎన్నికల సమయానికి ఓటర్ల సంఖ్య మరింత పెరగనుంది.

# ఆందోళన కలిగిస్తున్న కొత్త వైరస్..

## సురక్షితంగా ఉండాలంటే ఇమ్యూనిటీని ఇలా పెంచుకోండి..



కరోనా భయం ఇంకా పూర్తిగా తొలగకముందే ప్రస్తుతం మరో కొత్త వైరస్ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. చైనాలో కొత్తగా హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వ్యాప్తి చెందుతుండడంతో అక్కడ హాస్పిటల్స్ అన్నీ కిక్కిరిసిపోతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్ చల్ చేస్తున్నాయి. కరోనా భయం ఇంకా పూర్తిగా తొలగకముందే ప్రస్తుతం మరో కొత్త వైరస్ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. చైనాలో కొత్తగా హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వ్యాప్తి చెందుతుండడంతో అక్కడ హాస్పిటల్స్ అన్నీ కిక్కిరిసిపోతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్ చల్ చేస్తున్నాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా దేశాలు అలర్ట్ అయ్యాయి. ఇక భారత్ లోనూ హెచ్‌ఎంపీ వైరస్‌కు చెందిన కేసులు 5 నమోదైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే ఈ కొత్త వైరస్ కూడా కరోనా లాంటి లక్షణాలను కలిగిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని వారు సూచిస్తున్నారు. అయితే ఇందుకు గాను మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో సహజసిద్ధంగా లభించే పదార్థాలతోనే మన ఇమ్యూనిటీ పవర్‌ను రెండింతలు పెంచుకోవచ్చు. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం.

### పండ్లు..

శరీర రోగ నిరోధక శక్తి పెరగాలంటే సీజనల్ పండ్లతోపాటు ఇతర పండ్లను కూడా మనం తినాల్సి ఉంటుంది. ముఖ్యంగా నిమ్మజాతికి చెందిన సిట్రస్ పండ్లను తినాలి. నారింజ పండ్లు ఇదే కోవకు చెందుతాయి. అలాగే నిమ్మ, ద్రాక్ష, కివి, బెర్రీ పండ్లు, క్యాప్సికం వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి ఊపిరితిత్తుల కణజాలాన్ని రక్షిస్తాయి. దీంతో హెచ్‌ఎంపీ వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది. వ్యాధి రాకుండా జాగ్రత్త పడవచ్చు.

### గ్రీన్ టీ..

గ్రీన్ టీని రోజూ రెండు కప్పులు సేవిస్తున్నా కూడా రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. గ్రీన్ టీలో కాటెకిన్స్ అని పిలవబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శ్వాసకోశ సమస్యలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. గ్రీన్ టీలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. కనుక హెచ్‌ఎంపీ వైరస్ నుంచి సురక్షితంగా ఉండాలంటే రోజూ గ్రీన్ టీని సేవించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉన్న ఆహారాలను తింటున్నా కూడా ఈ వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది. మనకు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా చియా విత్తనాలు, అవిసె గింజలు, వాల్ నట్స్ లో లభిస్తాయి. ఇవి ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి. శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి. దీంతో శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

### అల్లం రసం..

అల్లం రసాన్ని సేవిస్తున్నా కూడా రోగ నిరోధక శక్తిని అమాంతం పెంచుకోవచ్చు. అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియ్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు నొప్పి, దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. హెచ్‌ఎంపీ వైరస్ నుంచి రక్షణ లభిస్తుంది. అదేవిధంగా రోజూ ఉదయాన్నే పరగడుపునే 2 వెల్లుల్లి రెబ్బలను తింటున్నా కూడా ఇమ్యూనిటీ పవర్‌ను అమాంతం పెంచుకోవచ్చు. వెల్లుల్లిలోనూ యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కనుక హెచ్‌ఎంపీ వైరస్ నుంచి రక్షణ లభించాలంటే రోజూ వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకుని హెచ్‌ఎంపీ వైరస్ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

# ఫిబ్రవరి 5న యూపీ, తమిళనాడులో ఉప ఎన్నికలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఉత్తరప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న మిల్కిపూర్ అసెంబ్లీ స్థానానికి, తమిళనాడులో ఖాళీగా ఉన్న ఈరోడ్ అసెంబ్లీ స్థానానికి కూడా ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగుతుందని భారత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ప్రకటించారు.ఉప ఎన్నికలు జరిగే ఈ రెండు అసెంబ్లీ స్థానాల ఎన్నికల ఫలితాలను కూడా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతోపాటే వెల్లడించనున్నట్లు ఈసీ తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. ఈ అన్ని ఎన్నికల కోసం జనవరి 10న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. జనవరి 17 వరకు నామినేషన్‌లకు అవకాశం కల్పించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు విధించనున్నారు.

## ఏసీబీ అధికారుల భేటీ.. ఏం జరగబోతుంది..



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ కేసులో తాజా పరిణామాలపై ఏసీబీ ఆఫీసులో అధికారులు భేటీ అయ్యారు. ఎఫ్ఈవో, హెచ్‌డీఏతో పాటు రెవెన్యూ అధికారుల పాత్రపై చర్చించడంతో పాటు సుప్రీం కోర్టును కేటీఆర్ ఆశ్రయిస్తే అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించారు. మరో వైపు.. అధికారులు అరవింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డి నోటీసులపై చర్చతో పాటు, మొదటి రేసు తర్వాత తప్పుకున్న కంపెనీలపై కూడా చర్చించారు. ఏసీబీ ఉన్నతాధికారులతో? బంజారాహిల్స్ ఏసీపీ,సీఐతో పాటు కొంతమంది సిబ్బంది సమావేశమయ్యారు. క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో కేటీఆర్ ఉన్నట్లు సమాచారం. కేటీఆర్ సుప్రీంను ఆశ్రయిస్తే తమ వాదన కూడా వినాలని ప్రభుత్వం.. కేవీయట్ వేసింది.

## కేటీఆర్‌దే బాధ్యత.. ఎఫ్ఐఆర్ క్వాష్ అరుదైన నిర్ణయం




హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ కొట్టేసిన నేపథ్యంలో ఆర్డర్ కాపీలో కీలక విషయాలను వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులకు మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి బాధ్యుడిగా ఉండాలి. హెచ్ఎండీఏ నిధులు సంబంధిత మంత్రి పర్యవేక్షణలోనే ఉంటాయని ప్రాథమికంగా తేలింది. అవి దుర్వినియోగం అయ్యాయా? లేదా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందని వ్యాఖ్యలు చేసింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత అనంతరం హైకోర్టు ఆర్డర్ కాపీ విడుదల చేసింది. 45అంశాలతో 35పేజీల ఆర్డర్ కాపీని విడుదల చేసింది. ఈ సందర్భంగా.. ఉన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థల అధికారాలను కోర్టులు అడ్డుకోలేవు. ఎఫ్ఐఆర్ క్వాష్ చేయడానికి కొన్ని పరిమితులు ఉంటాయి. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బును నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూర్చి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు లబ్ధి చేకూర్చారని అభియోగాలున్నాయి. ఆరోపణల మేరకు ఏసీబీ అధికారులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి ప్రభుత్వంలో పురపాలక మంత్రిగా ఉన్న కేటీఆర్ హెచ్ఎండీఏ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసే అధికారాన్ని కోర్టు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. పోలీసుల దర్యాప్తు అన్యాయంగా ఉంటేనే కోర్టు తన అధికారాన్ని వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోలీసులకు ఉన్న అధికారాలను కోర్టు ఎప్పుడూ అన్యాయంగా తీసుకోదు. ఏసీబీ చేసిన ఆరోపణల్లోకి వెళ్లి దర్యాప్తు చేయాలని కోర్టు భావించడం లేదు. ఈ కేసులో నేరపూరిత కుట్ర జరిగిందని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి బాధ్యత గల హోదాలో ఉన్నారు. మరో నిందితుడితో కలిసి కేటీఆర్ హెచ్ఎండీఏ నిధులను అక్రమంగా వినియోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంత్రి మండలి, ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే పిటిషనర్ హెచ్ఎండీఏ నుంచి భారీ మొత్తంలో నగదు బదిలీ చేయించినట్లు ఆరోపణలున్నాయి. సొంత లబ్ధి కోసమా.. లేక మూడో వ్యక్తి ప్రయోజనం కోసం నగదు బదిలీ జరిగిందా.. అనేదానిపై దర్యాప్తు జరగాల్సి ఉంది. అయితే, నిధుల దుర్వినియోగం జరగలేదని పిటిషనర్ వాదించడాన్ని కోర్టు నమ్మడం లేదు. దర్యాప్తులో ఈ విషయాలన్నీ తేలాల్సి ఉంది. నేరం జరిగిందని చెప్పడానికి ప్రాథమిక ఆరోపణలు మాత్రమే ఎఫ్ఐఆర్ లో ఉంటాయి. పూర్తిస్థాయి వివరాలన్నీ ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చాల్సిన అవసరం లేదు. డిసెంబర్ 18న ఫిర్యాదు అందితే, 19న ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. డిసెంబర్ 20న పిటిషనర్ క్వాష్ పిటిషన్ వేశారు. ఆధారాలు సేకరించాల్సిన సమయం దర్యాప్తు సంస్థలకు కావాలి. దర్యాప్తు విషయంలో హైకోర్టు జోక్యం చేసుకోదల్చుకోలేదు' అని ధర్మాసనం కామెంట్స్ చేసింది.

## యూత్ కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ వార్నింగ్



హైదరాబాద్: బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకుల దాడిపై టీపీసీసీ సీరియస్ అయ్యింది. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన ఉండాలి.. ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవే. కానీ యూత్ కాంగ్రెస్ఇ లా ఒక రాజకీయ పార్టీ కార్యాలయంపైన దాడికి వెళ్లడం సరైంది కాదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యూత్ నేతలను పిలిచి మందలించనున్న మహేష్ కుమార్ గౌడ్.. బీజేపీ నేతలు కూడా ఇలా దాడులు చేయడం సరైంది కాదన్నారు. బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తున్నా.. ప్రజాస్వామ్యంలో దాడులు పద్ధతి కాదు. శాంతి భద్రతల విషయంలో బీజేపీ నాయకులు సహకరించాలి" అని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాగా, ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ కాల్కాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కేంద్ర మంత్రులను అడ్డుకోవాలంటూ యూత్ కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించి. రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేశారు. రమేష్ బిదూరి దిష్టిబొమ్మను దహనం చేశారు.

## 'చంద్రబాబు విధ్వంసం.. పురందేశ్వరికి కనబడలేదా?'



తాడేపల్లి: పురందేశ్వరి కేవలం చంద్రబాబు ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారంటూ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ, చంద్రబాబు వలన హైందవ ధర్మానికి కల్గిన నష్టాల గురించి ఆమె ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రశ్నించారు. చంద్రబాబు వలన గోదావరి పుష్కరాలలో 29 మంది హిందూ భక్తులు చనిపోయినా ఆమె పట్టించుకోలేదు. విజయవాడలో చంద్రబాబు 50 ఆలయాలను కూల్చేసినా ఆమెకి కనపడలేదు. కానీ వైఎస్ జగన్ పాలనపై మాత్రం అనవసర ఆరోపణలు చేస్తున్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆలయాలను నిర్మించారు. ఆలయాల్లో ఉన్న అర్చకులకు వేతనాలను పెంచారు. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా చేసింది కూడా జగనే. వంశపారంపర్య హక్కులను జగన్ తీసుకువచ్చారు" అని కొట్టు సత్యనారాయణ వివరించారు. కాణిపాకం, కాళహస్తి, శ్రీశైలం, అమరావతి, ద్రాక్షారామం, కనకదుర్గమ్మ గుడి, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, వాడపల్లి, అంతర్వేది, అయినవల్లి.. ఇలా అనేక ఆలయాల్లో అభివృద్ధి చేశారు. విజయవాడ గుడికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. 49 ఆలయాల్లో ఏకకాలంలో కుంభాభిషేకాన్ని జగన్ నిర్వహించారు. కంచి పీఠాధిపతి సైతం దీన్ని మెచ్చుకున్నారు. శ్రీ వాణి ట్రస్టు ద్వారా 3 వేల ఆలయాలను కొత్తగా జగన్ హయాంలో నిర్మించారు. ఇలా చేసిన అనేక మంచి కార్యక్రమాలు పురందేశ్వరికి కనపడలేదు. కేవలం చంద్రబాబు దగ్గర మార్కులు పొందటానికే గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హైందవ శంఖారావంలో రాజకీయాలు మాట్లాడటం పురంధేశ్వరికే చెల్లింది. చంద్రబాబు కోసమే ఆమె పని చేస్తున్నారు. సెక్షన్ 83 ని సవరణ చేసి ఆలయ భూముల లీజులు వసూలు చేయటం, అన్యాక్రాంతమైన భూములను కాపాడారు. ఈ చట్ట సవరణను ఇతర రాష్ట్రాలు సైతం అనుసరించాయి. తిరుమల లడ్డూని అనవసరం వివాదం చేశారు. దీని వలన హిందూ సమాజానికి ఏమైనా మేలు జరిగిందా?. హైందవ శంఖారావంలో పీఠాధిపతులు చెప్పినవన్నీ జగన్ చేసి చూపించారు. దాన్ని కొనసాగేలా ఇప్పటి ప్రభుత్వం చూడాలి. అంతేతప్ప ప్రత్యర్థులపై తప్పుడు ఆరోపణలు చేయొద్దు" అని కొట్టు సత్యనారాయణ హితవు పలికారు.

# సురక్షిత డిజిటల్ ప్రపంచం కోసం!



కాలం మారుతున్నకొద్దీ, సాంకేతికతలు విస్తరిస్తున్నకొద్దీ కొత్త భయాలు పుట్టుకొస్తాయి. తమ పిల్లలు సోషల్ మీడియా వ్యామోహంవల్ల చెడిపోతున్నారని కొన్నాళ్లుగా తల్లిదండ్రుల్లో బెంగ పట్టు కుంది. అక్కడ తారసపడే విశృంఖల పోకడలు, తప్పుడు భావాలు పిల్లల మెదళ్లపై దుష్ప్రభావం కలగ జేస్తున్నాయి. వారి బాల్య, కౌమార దశలను కొల్లగొడుతున్నాయి. పిల్లలకు మాదకద్రవ్యాలు అల వాటు చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కాదనలేనిది. నిజానికి సోషల్ మీడియా దుర్వ్యసనంగా మారిన వైనమూ, దాని పర్యవసానాలూ చెదురుమదురుగా కనిపిస్తూనే ఉన్నాయి. కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చినప్పుడు కొత్త తలనొప్పులు సహజమే. ఈ నేపథ్యంలో 18 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవటానికి తల్లిదండ్రుల అనుమతి తప్పని సరి చేస్తూ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం ముసాయిదా నిబంధనలను కేంద్రం రూపొందించింది. అభ్యంతరాలు, సూచనలు వచ్చే నెల 18లోగా తెలియజేయాలని కోరింది. డేటా పరిరక్షణ కోసం, వ్యక్తిగత గోప్యత భద్రత కోసం ఒక చట్టం అవసరమన్న సంగతిని మన పాలకులు గ్రహించటంలో అలవిమాలిన జాప్యం చోటుచేసుకుంది. పౌరుల వేలిముద్రలు, బ్యాంకు ఖాతాలతో సహా సమస్త వివరాలనూ సేకరించే ఆధార్ వ్యవస్థ తీసుకొచ్చిన ఏడెనిమిదేళ్ల వరకూ ఆ డేటా పరిరక్షణకు ఎలాంటి కట్టుదిట్టాలు అవసరమన్నది ఎవరికీ తట్టలేదు. 2017లో జస్టిస్ పుట్టస్వామి పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను తొలిసారి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. మరో ఆరేళ్ల తర్వాత 2023 ఆగస్టులో డీపీడీపీ చట్టం వచ్చింది. దాని అమలుకు సంబంధించిన నిబంధనల రూపకల్పనకు మళ్లీ ఇన్ని నెలలు పట్టింది. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్న వర్త మానంలో ఈ అంశంపై ఇప్పటికైనా ముసాయిదా నిబంధనలు రావటం హర్షించదగ్గది. ప్రస్తుతం ఎటునుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని వాతావరణంలో ప్రపంచం మనుగడ సాగిస్తోంది. గోడలకు చెవులుంటాయన్నది పాత సామెత. స్మార్ట్ ఫోన్లకు చెవులే కాదు... కళ్లు కూడా ఉంటున్నాయి. మనం పక్కవారితో సాగించే పిచ్చాపాటీని సైతం వినే సదుపాయం ఆ ఫోన్లలో ఉంటున్నదని, మన ఇష్టాయిష్టాలు తెలుసుకోవటం, వాటి ఆధారంగా డేటా రూపొంది క్షణాల్లో ఎవరెవరికో చేరిపోవటం రివాజైందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఫోన్‌లు వినియోగించనప్పుడు సైతం వాటి కెమెరాలు కళ్లు తెరిచే సాంకేతికత ఉన్నదంటున్నారు. ఇలాంటి ఫోన్‌లు తెలిసీతెలియని వయసులో ఉన్న పిల్లలకు ఎంత చేటు తీసుకురాగలవో ఊహించటానికి కూడా భయం వేస్తుంది. అందువల్లే ఎప్పుడెప్పుడు తగిన నిబంధనలు వస్తాయా అని తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. తమ డేటా, బ్యాంకు ఖాతాల సమాచారం బయటకెలా పోతున్నదో తెలియక పెద్దలు కంగారు పడుతుంటే సామాజిక మాధ్యమాల్లో దుండగుల బారినపడి పిల్లలు తల్లడిల్లు తున్నారు. వినియోగదారుల డేటా సేకరణలో పారదర్శకతనూ, ఎందుకోసం సేకరిస్తున్నారో వెల్ల డించటాన్నీ నిబంధనలు తప్పనిసరి చేస్తున్నాయి. ఒకవేళ సంస్థల అజాగ్రత్త వల్ల లేదా ఉద్దేశపూర్వక చర్యవల్ల డేటా లీకైతే ఫిర్యాదు చేయటానికి కూడా ఏర్పాట్లున్నాయి. అలాగే సంస్థల్లో డేటా సేకర ణకు అనుసరిస్తున్న విధానాలను సవాలు చేయటానికి, వివరణ కోరటానికి అవకాశం ఉంది. నిబంధనల అమలును పర్యవేక్షించటానికి ప్రభుత్వం డేటా పరిరక్షణ బోర్డు (డీపీబీ) ఏర్పాటు చేస్తుంది. ఇదిగాక ప్రతి సంస్థా తమ ఖాతాదార్ల గోప్యత దెబ్బతినకుండా చూసేందుకు, వినియోగదారుల నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు డేటా పరిరక్షణ ప్రత్యేక అధికారిని నియమించు కోవటం, నిఘా పెట్టడం తప్పనిసరవుతుంది. డేటా లీక్‌ను అరికట్టడంలో విఫలమయ్యే సంస్థకు రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. మొత్తంగా మనం పౌరుల డేటా పరిరక్షణలో వెనకబడినట్టే, సామాజిక మాధ్యమాల దుష్ప్ర భావాల నుంచి పిల్లల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్న విషయంలోనూ వెనకబడ్డాం. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో 137 దేశాలు చాన్నాళ్ల క్రితమే డేటా పరిరక్షణ చట్టాలు తెచ్చాయి. అమెరికాలో పదమూడేళ్లలోపు పిల్లలు ఆన్‌లైన్ వీక్షణపై కఠిన నిబంధనలున్నాయి. యూరప్‌లో పదహారేళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రుల అనుమతి అవసరం. ఆస్ట్రేలియా సామాజిక మాధ్యమాల్లో పదహారేళ్లలోపు పిల్లల ప్రవేశంపై ఇటీవలే పూర్తి నిషేధం విధించింది. మన దేశంలో లేదుగానీ... టిక్‌టాక్ వల్ల విదేశాల్లో ఎన్నో సమస్యలొస్తున్నాయి. టీనేజ్ పిల్లల్లో 58 శాతంమంది దాన్ని చూస్తు న్నారని ఒక సర్వే చెబుతోంది. పసిహృదయాలకు ఉండాల్సిన అమాయకత్వం మాయమై అవాంఛ నీయ పోకడలు ప్రవేశించి వారిలో విషబీజాలు నాటుతున్నాయి. తప్పుడు భావాలూ, అభిప్రా యాలూ వ్యాపిస్తున్నాయి. పిల్లల సంగతలావుంచి... పెద్దలే వాటి మాయలో పడి తప్పుడు నిర్ణ యాలు తీసుకుంటున్నారు. ఆర్థికంగా కలిగే నష్టం నేరుగా కనబడుతుంది. కానీ మానసికంగా అది కలగజేసే ప్రభావం లెక్కకు అందనిది. ఇప్పుడు ఏఐ సైతం వచ్చి ప్రమాద తీవ్రతను పెంచింది. పిల్లల ముచ్చట కాదనకూడదని కార్లు, టూ వీలర్లు అందించి కొందరు తల్లిదండ్రులు పరోక్షంగా వారి చావుకు కారణమవుతున్నారు. ప్రజలకు ముప్పు కలిగిస్తున్నారు. అందువల్ల సామాజిక మాధ్య మాల్లో పొంచి వుండే ప్రమాదాలపై ముందు తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. పిల్లల సంరక్షణకు ఇది తప్పనిసరి.

# ఆందోళనగా ఉంది!



భారత దేశాన్ని విద్వేష సునామీ ముంచెత్తుతోందని అంతర్జాతీయ సమాజం మరోసారి ఘోషిస్తుంది. సామాజిక జీవనంలో మతవిద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. 198 దేశాల్లో 'సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన (ఎస్‌హెచ్‌ఐ)' అన్న అంశంపై అధ్యయనం చేసిన ప్యూ సంస్థ తాజా ఇండెక్స్ ప్రకారం భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉండటం అత్యంత విషాదం. ఇలాంటి పరిస్థితుల్లో "సామాజిక సహకారానికి, భిన్న వర్గాల మధ్య సామరస్యానికి చిచ్చు పెట్టే క్లిష్ట ప్రసంగాలు సమర్ధనీయం కానే కాదు. ఎక్కడికక్కడ కుల, మత, ప్రాంతీయ విభేదాలు రాజేస్తూ ఓట్ల చలి మంటలు కాచుకునే విద్వేష ప్రసంగీకుల్ని అణచివేయని పక్షంలో రాజ్యాంగ విలువలు చచ్చుబడిపోతాయి" అని సర్వోన్నత న్యాయస్థానం వ్యక్తం చేసిన ఆందోళనను మరోసారి గుర్తుచేసుకోవాలి. మనుషుల్ని కులం పేరిట, మతం పేరిట, ఆహారం పేరిట ఇంకా సవాలక్ష మౌఢ్యాలతో హింసిస్తూ దేశభక్తుల ముసుగులో తిరగడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అసలైన దేశభక్తి మనుషులను ప్రేమించడంలో ఉందని వందేండ్ల కిందటే మహాకవి గురజాడ చెప్పిన మాటలు ఇంకా మతోన్మాదుల బుర్రకెక్కలేదు. అందుకే ఈ మహా వాక్యానికి ఇంకా ప్రాసంగిత ఉంది. మనుషుల్ని ప్రేమించడం, మానవశ్రమతో దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవడం, స్వయం సమృద్ధిని సాధించడం, కులమత మౌఢ్యాల నుంచి విముక్తమై "అన్నదమ్ముల వలెను జాతులు/ మతములన్నీ మెలగవలెనోయి/మతం వేరైతేను యేమోయి/ మనసులొకటై మనుషులుంటే" అని కాంక్షించిన గురజాడ దృష్టిలో దేశభక్తి అంటే ఇది. కానీ, దేశంలో అలాంటి పరిస్థితులే కరువయ్యాయని తాజా నివేదిక స్పష్టం చేస్తుంది. మొన్నటికి మొన్న సాక్షాత్తు పార్లమెంటులోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత మీదే అక్కసు వెళ్లగక్కారు. దేశంలోని ముస్లింలు, ఇతర మైనారిటీలకు వ్యతిరేకంగా స్వయంగా మోడీనే విద్వేష ప్రసంగాలు చేసిన సందర్భాలు కోకొల్లలు. "ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా" అన్నట్టు ప్రభుత్వ అధినేతలే విద్వేష పూర్వక ప్రసంగాలు చేస్తుంటే వారి పరివారాన్ని కట్టడి చేయడం సాధ్యమేనా? తినే తిండి మీద ఆంక్షలు, కట్టుకునే బట్టమీద ఆంక్షలు, భావ ప్రకటన పైనా ఆంక్షలు, పుట్టిన నేలపై స్వేచ్ఛగా జీవించాలన్నా ఆంక్షలు. చివరకు బతుకు దెరువు కోసం చేసే పని మీద కూడా ఆంక్షలే! అసలు దేశం ఎటుపోతోంది? ఏమైపోతున్నది? సగటు భారతీయుని ఆవేదన ఇది. ఓవైపు ఆధునిక ప్రపంచం అంతరిక్షంలో కూడా పరిశోధనలు చేసే స్థాయికి దూసుకుపోతుంటే, దేశాన్ని మరోవైపు మతవిద్వేషాలు, మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలమయం చేస్తున్న తీరును ఏమనాలి? పాలకులు దేశానికి ఏం చెబుతున్నట్టు? ఏం సూచిస్తున్నట్టు? ఈ దేశం 'మీది కాదు మాది' అంటే భిన్నత్వంలో ఏకత్వంలా కలిసుండే ప్రజలు ఎక్కడివెళ్లాలి? ఇది విచ్చిన్న విధానం. ఇదే వ్యవస్థ ఇప్పుడు దేశంలో అమలవడం చూస్తుంటే ఆందోళనగా ఉన్నది. మరోవైపు చరిత్ర పుటలను మతం రంగు పులిమిన కళ్లద్దాలతో చూసేవాళ్లు ఉత్తుత్త పుకార్లను చరిత్రగా నమ్మేవాళ్లు ..చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారు. బడిలో "భారతదేశం నా మాతృభూమి/ భారతీయులందరూ నా సహోదరులు" ప్రతిజ్ఞ చేశాం. ఇప్పుడా ప్రతిజ్ఞకు తిలోదకాలిచ్చి ఒకరినొకరు చంపుకునే దుస్థితికి దిగజారిపోయాం. మణిపూర్‌లో ఏడాదిన్నరగా జరుగుతుందదే. విద్వేష భావజాలం వెళ్లగక్కి సౌభ్రాతృత్వాన్ని చావు దెబ్బ తీసేవాళ్లపై ప్రభుత్వాలు చర్యలకు పూనుకొని ఉంటే నేడు ఇలా అగ్నిగుండంలా మారుతుందా? ఒకరికొకరై అందరొక్కటై కుల మత ప్రాంతీయ భాషా భేదాలకు అతీతంగా ఒకే జాతిగా భారతీయులు ప్రగతి పథాన పురోగమించాలని అలనాటి రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. జరుగుతున్నదేమిటి? ఉమ్మడి భావన బీటలు వారుతోంది. సంకుచిత భావజాల ప్రచారం విభేదాలకు, సామాజిక అశాంతికి, చీలికలకు పాలుపోస్తోంది. జన సమూహాల నడుమ కత్తులు దూసుకునే శత్రుత్వాలకు, నెత్తుటేళ్లు పారించే వైషమ్యాలకు అంటుకడుతోంది. ఈ దుష్ప్రచారాన్ని క్షణాల వ్యవధిలో అసంఖ్యాకులకు చేరవేయడంలో వాట్సాప్ మాధ్యమాల యూనివర్సిటీ విద్యార్థులు తలమునకలై ఉన్నారు. అశ్లీల, అసభ్య సమాచార వాహికలుగా భ్రష్టు పట్టి పరువు మోస్తున్న సామాజిక మాధ్యమాలు విద్వేష వ్యాఖ్యల పంపిణీ ఏజెన్సీలుగా దిగజారి కలుషిత సాగరాల్ని తలపిస్తున్నాయి. తద్వారా వాటిల్లే విపరీత నష్టాల తీవ్రతను ముందుగానే ఊహించి కావచ్చు. అసహనం, భావజాలపరమైన ఆధిపత్యం, దురభిప్రాయాల కుదుళ్ల నుంచి పుటుకొచ్చే విద్వేష నేరాలను ఏమాత్రం సహించరాదు. విభజించు, పాలించు నినాదంతో మత, విద్వేష పాలన సాగిస్తున్న కేంద్రం విధానాల్ని ఎదుర్కోవడం ప్రస్తుతం దేశ లక్ష్యం. లౌకిక ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న శక్తులకు మద్దతు నివ్వడం, వారిబాటలో అడుగులేయడం ప్రజల కర్తవ్యం. చీకట్లోకి నెడుతున్న భారతావనికి వెలుగులు చూపడం అందరి బాధ్యత. ఇక ఆలోచించాల్సింది పౌర సమాజమే.

# హెచ్ఎంపీవీ కలకలం

బెంగళూరు,చెన్నైలో ఇద్దరు చొప్పున..

అహ్మదాబాద్‌లో ఒకరికి నిర్ధారణ

ఎలాంటి అంతర్జాతీయ ప్రయాణాలూ లేకుండానే సోకిన వైరస్

భయపడాల్సిన అవసరం లేదు ఇది సాధారణ శ్వాసకోశ వైరస్‌ల లాంటిదే : కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : భారత్‌లో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు నమోదు కావటం ఆందోళన కలిగిస్తున్నది. సోమవారం ఒక్కరోజే దేశంలో ఐదు కేసులు నిర్ధారణ అయ్యాయి. కర్నాటకలోని బెంగళూరులో రెండు, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఒకటి, తమిళనాడులోని చెన్నైలో రెండు కేసులు నమోదు అయ్యాయి. తొలుత బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో ఇద్దరు చిన్నారులలో ఈ వైరస్‌ను గుర్తించారు. వీరిలో ఒకరు 3 నెలలు, ఇంకొకరు 8 నెలల వయసున్న చిన్నారులే కావటం గమనార్హం. దీనిని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) ధ్రువీకరించింది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అయితే, ఈ ఇద్దరి చిన్నారులకు గతంలో ఎలాంటి అంతర్జాతీయ ప్రయాణాలు చేసిన సందర్భాలూ లేవు. అయినప్పటికీ, వారిలో ఈ వైరస్ గుర్తించబడటం ఆందోళనను కలిగిస్తున్నది. వారిద్దరికీ బెంగళూరులోని బాప్టిస్టు ఆస్పత్రిలోనే చికిత్స అందించగా.. వారిలో ఒకరు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్టు సమాచారం. మరొకరు కోలుకుంటున్నారని తెలిసింది. ఇక బెంగళూరులో కేసుల నిర్ధారణ తర్వాత గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మరొక కేసు నమోదైంది. రెండు నెలలున్న శిశువుకు హెచ్ఎంపీవీ పాజిటివ్‌గా తేలింది. ఆ చిన్నారిని చంద్‌ఖేడా ప్రాంతంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి.. చికిత్స అందించారు. గత డిసెంబర్ 26న దీనిని గుర్తించినప్పటికీ.. ఈ విషయాన్ని సదరు ప్రయివేటు ఆస్పత్రి ఆలస్యంగా తెలియజేసిందని అధికారులు చెప్పారు. ప్రస్తుతం బాలుడిని ఐసోలేషన్‌లో ఉంచినట్టు చెప్పారు. అయితే, బాలుడికి సోకిన ఈ వైరస్ విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నది.తమిళనాడులో రెండు హెచ్ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. చెన్నైలో ఇద్దరు చిన్నారులకు వైరస్ సోకినట్టు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం ఈ విషయాన్ని వెల్లడించింది. వారికి చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. అయితే, దీనికి సంబంధించి ఇంకా పూర్తిగా వివరాలు తెలియాల్సి ఉన్నది. పశ్చిమ బెంగాల్‌లో సైతం ఒక చిన్నారికి వైరస్ సోకినట్టు వార్తలొచ్చాయి. అయితే, రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఏ ఒక్క హెచ్ఎంపీవీ కేసూ నమోదు కాలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టత నిచ్చారు. ఇటు



హెచ్ఎంపీవీ కేసులు భారత్‌లో నిర్ధారణ కావటంతో ఈ వైరస్ గురించి సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడిచింది. పలువురు ఈ వైరస్‌ను కరోనాతో పోల్చారు. లాక్‌డౌన్ హ్యాష్‌ట్యాగ్ ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది.

### ఆందోళన వద్దు : కేంద్రం



హెచ్ఎంపీవీ కేసుల నమోదుపై దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. గతంలో కరోనా సమయంలో భారత్‌లో ఒకట్రెండు కేసులుగా నమోదై.. అది లక్షల సంఖ్యకూ చేరటం, వేలాది మంది చనిపోవటం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉన్నదని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. మిగతా సాధారణ శ్వాసకోశ వైరస్‌లలానే ఇది ఉంటుందని స్పష్టం చేసింది. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయెల్ భరోసా ఇచ్చారు. భయపడాల్సిన అవసరం లేదనీ, దేశంలో శ్వాసకోశ వ్యాధుల ఇన్ఫెక్షన్స్‌కు సంబంధించిన కేసులను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇందుకు అన్ని ఏర్పాట్లూ చేశామనీ, ఆస్పత్రుల్లో అవసరానికి మించి పడకలు, సామగ్రి, ఇతర మెడికల్ సౌకర్యాలను సమకూర్చామన్నారు.

### 'చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్త'

చలికాలంలో సాధారణంగా తలెత్తే శ్వాసకోశ లక్షణాలే హెచ్ఎంపీవీకి ఉంటాయని అతుల్ చెప్పారు. దగ్గు, ముక్కు కారటం, గాలి పీల్చుకోవటం కష్టంగా మారుతుందన్నారు. గొంతు నొప్పి, జ్వరం వంటి లక్షణాలు ఉండొచ్చన్నారు. ముఖ్యంగా, చిన్న పిల్లలు,వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఎక్కువ ఇబ్బంది పడతారని చెప్పారు. సాధారణ లక్షణాలే ఉన్నప్పటికీ.. తీవ్రంగా అనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని అతుల్ సూచించారు. ఈ వ్యాధి లక్షణాలు బయట పడటానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుందని వైద్య నిపుణులు వెల్లడించారు.